ప్రబుద్ధాంధ్ర

కళాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము ఆగష్టు ౧౯౩౪ { సంచిక ౮

కాళిదాసుని అపకీర్తి

విశ్వనాథ సత్యనారాయణగారు ఎం. ఏ.

నైమిత్తికప్రళయం అయిపోవటంతోనే నూతన బ్రహ్మనిశ్వాసాలు బయలుదేరినై. ధర్మదేవత తన మూర్తి తాను చూచుకుంది. నిత్యమై సహజమైన తన సృష్టిని ఒక కాలంలో మూర్ఖులు గ్రథితమను కొంటారని తలచింది. ఆభావంలో స్వకీయతేజో వికారమయినదిన్నీ భావిష్యత్కమయినదిన్నీ అయిన కవితామూర్తి మీద ఆమె మనస్సు పారింది. ఆమూర్తి తన చుట్టూ ఒక దివ్యతేజస్సు ఒక దివ్యలోకము కల్పించుకుంది. ఆలోకంలో ఒక తేజోరాశి భాసించాడు. ఆయన కాళిదాసు అతని వాక్కులోనుండి యొక యశోరేఖ బయలుదేరి మూడులోకాలని తన శుభ్రజ్యోత్స్నలో ముంచి యెత్తుతోంది ధర్మదేవత పంకాయించి చూచింది. అంతటి ప్రభారాశిలో ఒక సువ్వగింజంత నలుపు కనిపించింది. దాని మూర్తి ఏకదేశమందు ఏకకాలమందే కనిపించింది.

బ్రహ్మనిశ్వాసాలు సుళ్లుతిరిగి ఋక్కులైనాయి యజుస్సులైనాయి, సామలైనాయి.

త్రేతాదిలో వాల్మీకిఋషి ముఖకమలంలోనుండి నూతనచ్ఛందోఽవతారం కలిగింది. నిత్యమైన తన నిశ్వాసాలల్లో కొంత సారూప్యం తెచ్చుకొన్న యీ మనుష్యులలో ప్రథమమైన శబ్దబ్రహ్మ వివర్తాన్ని చూస్తే బ్రహ్మకి మళ్ళీ కాళిదాసుని యశోమూర్తి జ్ఞాపకం వచ్చింది బ్రహ్మవాల్మీకుల అరక్షమైన చక్షుస్సులు రెండూ పరిశీలించినై. ఆ నల్లని మచ్చ అల్లాగే వుంది.

సమమధురోపనతార్థవాక్యబద్ధమైన రామచరితం సాగింది.

ద్వాపరాంతంలో వ్యాసులు అవతరించారు. ఆయన రచనలకి అంతూ పంతూ లేకపోయింది. వేదాలు విభాగించాడు పద్ధెనిమిది పురాణాలు వ్రాశాడు. బ్రహ్మసూత్రాలు వ్రాశాడు భారతం కావ్యం కట్టాడు. ఇంత చేసీ తన కవితాశక్తి యసంపూర్ణమనుకొని భవిష్యత్తులో చూశాడు మహాకవి కాళిదాసు గోచరించాడు. ఆయన యశస్సు త్రిలోకాలల్లో త్రికాలాలల్లో దేదీప్యమానంగా వెలిగిపోతూంది. కాని ఏదో యొక చిన్న మచ్చ మాత్రం కనిపిస్తూనే వుంది.

పుడతాడు పుడతాడు అనుకొన్న మహాకవి కలిప్రవేశించిన మూడువేల యేళ్లకు గాని పుట్టలేను. ఆ

ప్రభువు పుట్టటంతోటే వ్యంగ్యలోకాల్లో ధ్వనిలోకాల్లో మోట్పాయితాలు కలిగినై.

ఆకవి పుట్టిన అగ్రహారంలో ఇంకనాలకి యజుస్సులు వచ్చు. వాసాలకి సాంగులు వచ్చు. గోడలకూ దూలాలకూ తర్కం వచ్చు. ఇళ్లల్లో ఈగలకు ధర్మశాస్త్రాలు తెలుసు. రజ్జువులకు వేదాంతాలు తెలుసు

శిల్ప మన్న పేరు పెట్టుకొని కవిత్వం 'ధర్మోల్లంఘన చెయ్యలే దప్పటి కింకా ఆరు శాస్త్రాలు చదివినా నాల్గు వేదాలు చదివినా ఆచరించినా ఋగ్యజుస్సామలకు కదిలే శిరస్సులు కాళిదాసు ఋతుసంహారశ్లోకాలకు కదలలేదు, సరికదా కదులుతై అని కూడ అనిపించలేదు. కుమారసంభవం వచ్చింది కాశ్మీరంలో పరిషత్తులు పులకరించినై. దక్షిణాపథంలో పంచవన్నెల చిలకలు కంఠతా పట్టినై. రసప్రపంచకాలల్లో రాపి శైకృన్నై పింపిళ్లు కూసినై.

కాని అగ్రహారం తొణకలేదు బెణకలేదు.

మేఘదూతం వచ్చింది. ఆదివరకు దారి తెన్ను తెలియని మొగిలు ఓండ్లు సుఖంగా దారి తెలుసుకు బయలుదేరారు. దాని దివ్యసంచారాలకు దిజ్నాగులు తొలగి దారి యిచ్చారు. మధుఃభారతి ఒయ్యారాలు పోయి సిగ్గు లొలికించుకంది. ఆసేతు సీతాచలం రసమేఘం రంగురంగుల నడకలు నడచి, సమార్ద్రము కాని క్షేత్రమే లేకపోయింది.

కాని అగ్రహారంమీద బొట్టు పడలేదు. వాన వసుందనైనా ఒక్క దర్దుర మంటే ఒక్క దర్దురమైనా కూసిందా? కూయలేదు రఘువంశం వచ్చింది అదివర కల్లా నేను కావ్యాన్ని నేను కావ్యాన్ని అన్న సంస్కృతరామాయణం బ్రహ్మసూత్రాలకి మల్లే ఉపనిషత్తులకి మల్లే వశిష్ఠులు రామచంద్రులకు దోవ యిచ్చినట్లు యిచ్చింది.

మహాకవి విక్రమార్కుని సభలో అర్ధసింహాసనారూఢు డైనాడు. మాళవిక నృత్యం చేసింది. చేసే ఆవిడ శరీరావయవా లన్నీ నక్షత్రాలల్లే మెరిసినై. మహాకవికి పాతికేళ్లు నిండలేదు. ఆయన ముగ్ధభావంలో మాళవిక సర్వావయవసుందరి అయింది. భాసుని యాత్మ అనుకుంది. "ఇతను పుట్టాడు. నాకు త్రవ్వి బయటకు తియ్యాలసిన యవస్థ పట్టిస్తాడు."

రాజాంతఃపురము తెరల చాటున కిలకిలా నవ్వింది. విక్రమార్కుడు చతురాంతఃపురవధూప్రసాదనరసికు డైనాడు

మహాకవి బంగారుసేలువవాడు, సింహతలాటాల మురుగులవాడు, రత్నహారములవాడు, బోయీలు మోచిన పల్లకీ మీద నగ్రహారము చూడబోయినాడు.

అగ్రహారము నిత్యకర్మలయందు నిమగ్నమై యున్నది మహాకవి వైభవమునకు అగ్రహారము నివ్వెఱకూడ భజించలేదు

కవి ప్రౌఢు డైనాడు. అతని కూర్వశి కనిపించినది. ఆమె సౌందర్య మంతయు నామె యురోజకాఠిన్యమునందే కనిపించినది. ఆమె వియోగకటునిశ్వాసాలవల్ల ఆమె యెదుఱ్ఱొమ్ము లేచుచు పడుచు నున్నది. కాళిదాసుకి సౌందర్యపిపాసవేత నున్మాద మెక్కింది. ఏమి యున్మాదము! ఉన్మాదావస్థలో నాట్యము నృత్య మైనది.

ధ్వనిలోకాలలో పరిణామము చాల లేదు. రసవీథులలో విస్తృతి పట్టలేదు

మహాకవి తన జన్మస్థల మైన యగ్రహారమువంక దిరిగి చూడలేదు. అగ్రహారము మహాకవికి వందిమాగధప్రాయ మైన లోకమును అపగతబుద్ధి యన్నది. ఖద్యోతుని లింగభేదము తోడి మెరుగుడుపురు వన్నది

మహాకవి కేబదియేళ్ళు వచ్చినై కవి శకుంతలారూపమును ధ్యానించాడు. భాషాదేవివంక చూచాడు ఆమె తన శబ్దస్వరూపాన్ని కుంచించుకు వచ్చింది. ఆమె శరీరము చుట్టును కనపడీ కనపడని

జ్యోతిస్సులు వెలిగినై. ఆయన మూర్తి శబ్దాన్ని దాటి వ్యంగ్యాన్ని దాటి ధ్వనిని దాటి, రసాన్ని దాటి యానందవీధుల్లో భాసాభాసమైన బ్రహ్మ పదార్థమల్లే గోచరించింది. ప్రభువు శకుంతలను చూచాడు. ముగ్ధయైన మాళవికలో మల్లే ఆమె యందు ప్రత్యయవయవశోభ చూడలేదు. ప్రౌఢయైన యూర్వశియందు మల్లే వక్షోజకాఠిన్యం చూడలేదు. సర్వసంసారము యొక్క సారము భావమొకటే యామె కన్నులయందు చూశాడు. ఆమె స్త్రీగా లేదు. అఖండమైన పుణ్యముల ఫలముగా మాత్రమే గోచరించింది.

దానితో వేదాలకు పౌరుష్యం పోయింది. ఉపనిషత్తులలో క్లిష్టత్వం తగ్గింది. ఋక్ఛందస్సులు వచ్చి ఆర్యులతో చేతోడుగా వాదోడుగా మెలగినై.

ఆనందబాష్పములు కురిసినై.

సాత్త్వికోదయం నిత్యమైనవిషయం అయింది.

అగ్రహారం యథావిధి తన కర్మలు తాను చేసుకుంది. సులభంగా సాధించే ఆనందాన్ని బహుజన్మలచేత సాధిస్తానంది.

కాళిదాసు దివ్యశరీరంతో వాఙ్మయలోకాల్లో తిరుగుతున్నాడు. మూడు లోకాల్లో మూడు కాలాల్లో అతని కీర్తి తెల్లగా వెలుగుతోంది, మచ్చ వాడిపోయింది. కాని అక్కడే వుంది. అది అగ్రహారమల్లే చాయగా కనిపించింది. అగ్నిహోత్రపు పొగ లేశమల్లే అల్లా అల్లా తోచింది. ఈర్ష్యాగ్రసమై అవిచారమై మూఢమై అరసజ్జమైన బుద్ధికి మల్లే కళావిహీనమై కనిపించింది

జగన్నాథుడైన కాళిదాసు ఆత్మ బ్రహ్మరథమెక్కి తిరుగుతోంది.

బ్రహ్మ, వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు నలువురు నాల్గు యుగాలకు వాఙ్మయలోకాలకు బ్రహ్మలైనారు. భవభూతి వారున్నయెడకు వెళ్లాడు. వాల్మీకి కాళిదాసులు తమలో ఆయన్ని కలుపుకున్నారు.

మూడు లోకాలమీదా నాల్గు యుగాలు మళ్లీ తిరిగినై. మళ్ళీ తిరిగినై. వెలుగుతో నిండిపోయినై లోకాలు కాలాలు. మచ్చ మచ్చగానే వుంది.

ఓం. తత్సత్

అదృష్టమంటే?

భావరాజు వేంకటకృష్ణరావుగారు. బి. ఏ., బి. ఎల్

ఇది జరిగి నూటముప్పయ్యేండ్లు అయింది. అది సిద్ధార్థి సంవత్సరము. టిప్పూసుల్తానును జయించడానికి జనరలు హేరిసు బందరునుంచి యింగ్లీషు సైన్యం తోడుపంపవలసిన దని మార్టినుదొరకు తాఖీదు పంపినాడు. పదిహేను వందల మంది సోల్జర్లు, నాలుగువేల మంది సిఫాయీలు గల పెద్ద పటాలం యిరవై ఫిరంగులతో బయిలుదేరింది. ఈదండుకు భోజనపదార్థములు, మందుగుండు సామానులు, ఫిరంగులు, తుపాకులు తర్లించుకొని వెళ్లడానికి మామూలు పరివారం చాలింది కాదు. బందరుకోట గవర్నరు చుట్టుప్రక్కల గ్రామాలకు జనంకోసం కబురులు పంపించి, దండోరా కొట్టించినాడు.

సుంకర గురవయ్య శ్రేష్ఠి ఆరోజులలో బందరుకోటలో కాపురమున్న పెద్ద వర్తకులలో గొప్పవాడు ఆతడు యింగ్లీషువారికి దుబాసి.

అతడు బరాతం పంపిస్తే హైదరాబాదు వర్తకులు, చెన్నపట్నం వర్తకులు, కలకత్తా వర్తకులు కూడా కన్నుల నద్దుకొని లక్షలకొద్దీ రూపాయీలు చెల్లించేవారు. ఇంగ్లీషువారికి ఏదైనా అవసరం వస్తే అతని సలహా లేనిదే బందరుకోట గవర్నరు ఏపనీ చేసేవాడు కాడు!

గురవయ్యశ్రేష్ఠికి కార్యకర్త రావిపాటి బ్రహ్మన్న ఆయన జటాంతస్స్వాధ్యాయి, జ్యోతిష్కుడు. కవి, రసజ్ఞుడు. బందరు పరగణాలో కాదుగదా చెన్నపట్నంలో నైనా యింగ్లీషు వ్రాయడంలో ఆయనంతటి ముసద్దీ లేడని ఆరోజులలో ఆయనచాలా ప్రఖ్యాతి సంపాదించాడు. బ్రహ్మన్న వ్రాసిన నివేదికలు, అర్జీలు మొదలయినవి యిప్పటికీ చెన్నపట్నం సెయింటుజార్జికోటలో కనబడతాయి.

బ్రహ్మన్న సేవకుడు నాగన్న. నాగన్న అంటే బ్రహ్మన్నకు యింత అంతా అభిమానం అని వర్ణించడానికి అలవి గాదు—పుత్రప్రేమ.

“ఒరే నాగన్నా! నీవు ఒకనాడు చాలా అదృష్టవంతుడవు అవుతావురా” అని అంటూవుండేవాడు బ్రహ్మన్నపంతులు.

“చిత్తం! చిత్తం! దేవర చల్లగా ఉండి. దేవర కటాక్షం మాకు పూర్తిగా ఉంటే, అంతే శానా, సామీ” అని అంటూ వుండేవాడు నాగన్న.

ఇంగ్లీషువారి పటాలమునకు భోజనసామగ్రి మొదలయినవి సరఫరా చేయించాలని సుంకర గురవయ్యశ్రేష్ఠికి వర్తమానం వచ్చింది. ఇదెంత పని అని, బ్రహ్మన్నతో ఆలోచించినాడు.

ఆరోజులలో రైళ్లు లేవు. మహాపథాలు మంచిస్థితిలో వున్నా బళ్లమీద సామానులు తర్లించుకొని వెళ్లడం బహు ప్రయాసకరంగా ఉండేది. ఏళ్లూ, నదులు, కొండలు గుట్టలు దాటి బండ్లు వెళ్లలేక పోయేవి. కాబట్టి సామగ్రి బండ్లమీద వెళ్లే ఉపాయం లేదు. ఆరోజులలో లంబాడీల గిత్తలను గుత్తకు తీసుకొని వాటిపైన సరుకులు వేసుకొని వర్తకులు వెళ్లుతూ ఉండేవారు. నల్లమల, ఎర్రమల కొండలలో పుట్టి, పెరిగి తిరగడం అలవాటు అవడంచేత లంబాడీగిత్తలు, కొండలు గుట్టలు సులభంగా ఎక్కి వడిగా నడవగలవు. ఏళ్లూ, నీళ్లూ అన్నా వాటికి భయం లేదు.

గురవయ్యశ్రేష్ఠికి పైనుంచి అంటే—అటు హైదరాబాదు, నల్లగొండ, ఓరుగల్లు జగ్గయ్యపేట, బెజవాడలనుంచి, వచ్చే సరకు లన్నీ యిజారాదార్లు లంబాడీగిత్తలమీదనే వేసుకొని పట్టుకొని వస్తూ ఉండేవారు అప్పుడప్పుడు అటు విశాఖపట్నం, నాగపురం, కటకంనుంచీ యిటు నెల్లూరు, బళ్లారి, గుత్తి, మైసూరు మొదలయిన పట్నాలనుంచి కూడా సరకులు యీ లంబాడీగిత్తలమీదనే మోయించుకొని వచ్చేవారు

వానలు వెనుకపట్టి, శీతాకాలం జొరబడేవేళకు లంబాడీల దండు గిత్తలను దీసుకొని బయిలుదేరదు. కాని వర్షాకాలం గడవకుండా యింగ్లీషువారి పటాలానికి ప్రయాణం తగిలింది. సామగ్రి తర్లించడానికి పెద్ద సిబ్బంది కావలసివచ్చింది.

బ్రహ్మన్న అపుడు ఆలోచన చెప్పినాడు దీవిలో లంబాడీల దండు ఒకటి విడిసి ఉన్నది. దానికి వెంటనే కబురు పంపమన్నాడు. కాని అలంబాడీలు వర్షాకాలం గడిచేనే కాని కాలు కదపమన్నారు. పోని మీ లంబాడీగిత్తలను మాకు తోలిపెట్టండి ఖరీదు ఇస్తామన్నాడు బ్రహ్మన్న. పదిహేను వందల గిత్తలు, మూడువేల వరహాలకు బేరం నిర్ణయించుకొని పైకానికి బరాతం యిచ్చి గిత్తలను తోలుకొని వచ్చారు.

పప్పు, ఉప్పు, బెల్లం, బియ్యం, బట్టలు, తుపాకులు, మందుగుండు మొదలయిన సామగ్రి అంతా గిత్తలపైన సంచులు కట్టి యెక్కించినారు. కొన్ని పెద్ద గిత్తలను ఏరి వాటికి ఫిరంగులు కట్టినారు

చాకళ్లను, మంగళ్లను, మాలమాదిగలను జీతాలిచ్చి రప్పించారు పరివారంలోకి సిబ్బంది, గిత్తలదండు కదిలింది. దానికి నాగన్న నాయకు డైనాడు. ముందు పటాలము, వెనుక నాగన్న గిత్తల దండు నడిచాయి.

* * * *

టిప్పూసుల్తానుతోడి యుద్ధం రెండేండ్లు సాగింది. నాగన్న అతని గిత్తలు పరివారం కూడా సిపాయీలతో పాటు విరిగి సున్నమైనారు. పదిహేనువందల గిత్తలకు చివరకు నాలుగువందల గిత్తలు మాత్రం నిలిచాయి గురవయ్యశ్రేష్ఠికి ఈ వ్యాపారంలో మొత్తంమీద పాతిక వేల వరహాలు నికరపు లాభం వచ్చింది. గిత్తలు చాలాభాగం నశించిపోయినాయి అని వర్తమానం వచ్చినపుడు ఆయన "పోనీలే మానాగన్నకు క్షేమమా? యిప్పుడెక్కడున్నాడు? ఇంటి కెప్పుడు వస్తాడు" అని ఆదరంతో అడిగినాడు.

యుద్ధం ముగిసింది. టిప్పూ యుద్ధం చేస్తూ కత్తి చేతిలో ఉంటూ ఉండగా ప్రాణాలు విడిచి వీరస్వర్గం జూఱగొన్నాడు. అంగ్లేయులను జయలక్ష్మి యుద్ధరంగములోనికి ఎదురువచ్చి వరించింది. అంగ్లేయులను ఎదిరించె మొనగాడు అంతరించినాడు. అతని శ్రీరంగపట్నం వల్లకాడుగా మారిపోయింది. ఒక నెలక్రితం లక్ష్మి కలకలలాడుతూ నృత్యం చేసిన చోటు కాలవశమున గ్రద్దలకు రాబందులకు నిలయమైపోయింది.

దుర్గంధం కొట్టుతూ పాడువారి ఉన్న ఆపట్నంలోనికి మానవు డెవడూ ప్రాణాలతో వెళ్ళి రాలేకపోయేవాడు. అట్టి దుస్థితిలో వున్నా, భయపడి పారిపోయిన భాగ్యవంతుల యిండ్లు దోచుకోవడానికి ముష్కరులు వెనుదీయడం లేదు చేతి కందిన దాని నల్లా సోల్జర్లు, సిపాయీలు యిదివరకే కొల్లగొట్టుకొనిపోయినారు కోట, పేట, అంతా యిపుడు పాడువారి ఉన్నది. వర్షాలు బాగా కురియడం చేత ఒక నెలరోజులకు, కుళ్ళిపోయిన చెత్త, శవాల్లు మొదలయిన వన్నీ కొట్టుకొనిపోయి కావేరిలో కలసిపోయినవి. పాడువారిన ఆమహానగరంలో యిటికరాళ్ళు తప్ప యేమీ దొరకపోయినా ఆశవున్న మానవు లందరు భయంలేకుండా పగలంతా అక్కడే వెదకుకుంటూ మసలుతూ ఉండేవారు.

శ్రీరంగపట్నం చూద్దామని మన నాగన్నకు కూడా కోరిక పుట్టింది. ఒకనాడు కోటలో తిరుగుతున్న అదృష్టవంతులకు మారుమూలలందు యింటి గోడలసందులలో వున్న రహస్యపు అరలలో వరహాల సంచులు, రత్నాలు దొరికిన వని విన్నాడు. ఆమాట విన్నప్పటినుంచి అతనికి కూడా ఆశ ఎక్కువ అయింది పొద్దుట బయలుదేరి కోటలో ప్రవేశించాడు. పగలంతా అరికాళ్ళు అరిగిపోయేటట్టు తిరిగినాడు. సాయంకాల మయింది. ప్రొద్దువాలుటకు సిద్ధముగా ఉన్నది. పాపం నాగన్నకు ఒక్క చిల్లిగవ్వైనా దొరకలేదు. అతడు విసిగి వేసారినాడు. ప్రాణములు ఉసూరు మనుచున్నవి.

"ఏమి వెదకుతావు దొరా! ఆకలి మండుతున్నది కడుపులో ప్రొద్దుట త్రాగిన గంజినీళ్ళు ఉప్పగల్లు! పోదాం! రా సామి!" అని అన్నాడు వెంటనున్న చాకలి చుక్కయ్య.

నాగన్నకు తనివి తీరలేదు. అలసిపోయినా, ఆశ తీగలు సాగుతున్నది. ఇంకా ఎక్కడైనా, ఏమయినా దొరుకుతుం దేమో అని ఆశ!

కోటలో ఒక వైపున కొన్ని కొట్లు ఉన్నవి. వాటిలో పూర్వం ధాన్యపురాసులు ఉండేవి. అవి అన్నీ యిపుడు ఖాళీ అవడం చేత, ఆప్రాంత మంతా నిర్మానుష్యం అవడం చేత వాటిలో దయ్యాలు కాపురం చేస్తున్నట్లు భీతిగొలుపుతు ఉన్నవి. నాగన్న సందెచీకటిలో అక్కడ వెదకడం ప్రారంభించినాడు. ఆసమీపంలో కుళ్ళిపోతూ ఉన్న ఉల్లిపాయల వాసన ముక్కు బ్రద్దలుగొట్టి, ప్రేవులు తోడేసేటట్టు కొట్టుతున్నది.

"అక్కడకు వెళ్ళుదాము, పదండి" అని అన్నాడు నాగన్న.

"అక్కడేముంది దొరా చీకటిలో!" అని అన్నాడు చుక్కయ్య.

"ఒరే చుక్కా! ఈఉల్లిపాయ లైనా వేసుకొని పోదామురా వీటి నైనా పట్నం తీసుకెళ్ళి అమ్ముకుంటే మూడు సంచుల వరహాలు మిగులుతాయి!" అని నాగన్న అన్నాడు.

ఆవైపునుంచి యీవైపు కొకసారి చూచి చుక్కయ్య "మూడు సంచులేం దొరా? యింకా వస్తాయి!" అని అన్నాడు.

నాగన్న గిత్తలదండు పిలిపించ మన్నాడు. మంచి ఉల్లిపాయ అంతా ఏరి సంచులలోని కెక్కించి గిత్తలమీదకు ఎత్త మన్నాడు

అదృష్టం అంటే కనబడనిది. కనబడకుండా వచ్చేది. ఉల్లిపాయ లైనా యింటికి పట్టుకొని వెళ్ళి అమ్ముకొని సొమ్ముచేసుకుందా మని నాగన్న ఊహించినాడు. కాని అతనికి అంతకంటె గొప్ప అదృష్టం చెప్పకుండా వచ్చింది.

కుళ్ళిపోతూ ఉన్న చచ్చు ఉల్లిపాయల రాసుల క్రింద వరహాల సంచులు కుప్పలుగా పడి ఉంటాయి తనకోసం అని నాగన్న కలలోను అనుకోలేదు. ఆసపడనూ లేదు. అదృష్టం అంటే అలాగున ఉండాలి! సంచులలోనికి ఉల్లిపాయలు ఎక్కిస్తున్నారు, నాగన్న అతని పరివారం అందరూ కలిసి. అంతలో ఘల్లు మని చప్పు డయింది.

"నాగన్నదొరా! మన అదృష్టం" అంటూ కేకలు పెట్టినాడు చాకలి చుక్కయ్య.

అదేమిటో అని దగ్గరకు వెళ్ళి చూచాడు నాగన్న. అప్పటికి బాగా చీకటి పడింది. చవితి చంద్రుడు క్రుంకుతూ గ్రుడ్డి వెన్నెల కాస్తున్నాడు. అక్కడ కాగడా లయినా లేవు వెలుతురు రంతకంటే లేదు. ఆచీకటిలో నాగన్న వరహాలసంచులు పాతిక లెక్కపెట్టినాడు. ఇంకా ఏమిటో ర్రాళ్ళ లాగున బరువుగా ఉంటే ప్రొద్దుట నే చూచుకుందాము లెండి, వెన్నెల క్రుంగిపోకుండా సంచులు ఇవతలకు చేర్చండి అని అన్నాడు

నాగన్న అపుడు గిత్త కొక వరహాల సంచి వేయ మన్నాడు. క్రిందా పైనా ఉల్లిపాయలు వేయించ మన్నాడు. నమ్మక మైన వారికి నలభయి మందికి నలభయి గిత్తలను ధనంతో వప్పగించినాడు. కోటలో అదివరకు అక్కడ యిక్కడ దొరకిన పాత తుపాకులను కొన్నింటిని, తన దగ్గర తూటాలు లేకపోయినా కొందరికి భుజాన వేసి రాత్రికి రాత్రి మకాం ఎత్తి ఏరు దాటినాడు.

బందరు చేరేటప్పటికి రావిపాటి బ్రహ్మన్న స్వర్గస్థులయినా డనీ, ఆయనతో పాటు గురవయ్య శ్రేష్ఠి కూడా కాలం చేసినా డనీ విన్నాడు. తన అదృష్టాని కంతకు కారణభూతు డైన బ్రహ్మన్నను తలంచుకొంటూ నాగన్న దుఃఖసముద్రంలో మునిగిపోయి పదిరోజులు మంచం పట్టినాడు.

ఒకనాడు నాగన్నదొర భార్యా రంగమ్మ ఏడుస్తూ భర్త చెంతకు వచ్చి "బ్రహ్మన్నపంతులు చనిపోతే మనకేం లోటు వచ్చింది? మీరు ఊరికే అలా పసిపిల్లలలాగున వాపోతున్నా రేమిటి? ఆ దేవర బిడ్డలం మనం. ఆయన మనలను రక్షించి కాపాడి యింతవాళ్లను చేశాడు ఆయన పేరు మరిచిపోకుండా నిలబెట్టుకుందాం!" అని ఓదార్చింది.

"బ్రహ్మన్నగారి బిడ్డలం అన్నావు గనుక ఆదేవర పేరెట్టుకుందాం" అని అన్నాడు నాగన్న. అంతటనుంచి నాగన్నదొర యింటిపేరు బ్రహ్మన్న దేవరవారు అయింది. "బ్రహ్మన్న దేవర" "బ్రహ్మదేవర అయి, చివరకు "బమ్మదేవర", "బొమ్మదేవర" అయింది.

ఇంతలో వల్లూరి పరగణాకు శిస్తు చెల్లక వేలానికి వచ్చింది. బందరుకోటనుంచి మార్టినుదొర బొమ్మదేవర నాగన్నదొరకు కబురంపించి "కొంటావా?" అని అడిగినాడు.

"దొరగారి సెలవైతే, అభ్యంతరం లేదు."

అని అన్నాడు నాగన్నదొర. అంతటనుంచి బొమ్మదేవరవారు జమీందారులైనారు.

(ఈ వృత్తాంతం నేను బాల్యంలో బందరులో ఉంటూ ఉండగా ఒక వృద్ధుడు చెప్పాడు.)

భావనావేశము

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి ఎం. ఏ., బి. ఎల్

సృష్టిహృదయమున స్రవించునది భావనము. భావనధునిహృదినుండి ఉవ్వెత్తుగ నుబుకునది ఆవేశము. భావనావేశము నిద్దురనుండి జీవకళలను ఎగురఁజిమ్మును. నిస్తబ్ధతనుండి గీతికాధారలను వెడలించును. రసబంధురహృదయమునుండి సౌందర్యమును గురిపించునది భావనావేశము భావవిద్యుత్తములను తళ్కొత్తించునది భావనావేశము. ప్రత్యక్షప్రపంచమున దివ్యకార్యములను తాజ్‌మహాలు లట్లు నిలుపునది భావనావేశము. కావ్యజగతియందు బృందావనమును పరిమళించునదియు భావనావేశమే. దీని శక్తియందు జగదీశుఁ డదృశ్యుడై యుండును. ఇది బొమ్మరాళ్లను సంపెంగపువ్వులు జేయును. చింతనిప్పులను మల్లెలుగావించును. మొద్దులను నిలిపి తాండవనృత్యము చేయించును! నవ్వుపల్లవములచే మొరడులను వికసింపఁజేయును. పాపులను పావనులను గావించును. పందలను పండితులను చేయును. చావును చంపి దివ్యదీప్తుల జల్లు జీవమును ప్రత్యక్ష మొనరించును. సృష్టికి ఆదియై సృష్టికి ప్రతిసృష్టిని చేయగలుఁగునది ఈ శక్తియే. దేవునకు మహత్తరమానవరూపు నిచ్చునదియు, మానవుని జగదీశునిఁ జేయునదియు నిదియే. తమమును పిండి వెలుగువెల్లువలను వెలారించునదియునీశక్తియే. అసాధ్యములను ఆశ్రితవందిమాగధుల నొనరించి, అరిష్టములను చరణాశ్రిత పరిచారికలఁజేసి దురంతదుఃఖములను ధూళ్యావలుంఠిత శత్రులఁగావించి, బ్రహ్మాండమును చేతిచెండును చేయునదియు నీశక్తియే. సంభవాసంభవములును, జీవమృత్యువులును, భౌతికాధ్యాత్మికశక్తులును, జీవాత్మ పరమాత్మలును. దీని కతననే భేదరహితములై! మహాపురుషుల జీవనరంగములందు జూపట్టును. మనుష్యహృదయము నిది ప్రాపుచేసికొనినందున. ఇహపరములు గోపికాగోపాలురై అందనరవతము రాసక్రీడల దేలుచుండును. గోపికాగోపాలురఁ గలుపు బంధము అనురాగము. సౌందర్యము, మాధుర్యము, ఆనందము, ఆవేగము, ఈ మిధునానురాగమున,— ఈ రాసక్రీడయందున్నవి. ఆశయములును ఆదర్శములును ఇందు శోభిలుచున్నవి కళామయమైన కృష్ణజీవనమునకు హృదయము ఆటపందిరియైనపుడు మనుష్యజీవనము కనదురుకొంతు లీను కావ్యజగతి కాదా? కాళక్రౌర్యముచే విషజ్వాలలు క్రక్కించి, భావనావేశమున దానిపై రసబంధురనృత్యము సలిపిన శక్తి అంతరంగజగతియందు వెలసియుండ దానిని గుర్తించిన వానికి గోవర్ధనగిరులు తలగొడుగులు గాక అడలుకొలుపు అపద లగునా? భావనావేశముపై నుబ్బూఁత లూఁగువానికి కళలు పట్టపురాణు లగును. ఘనకార్యములు చేతిబొమ్మ లగును! ఘనశైల

ములు బొమ్మరాళ్లయి అతని కాలిక్రింద అడఁగియుండును! వాని జీవితము సౌందర్యోపేతమై, రసబంధురమై, గురుగంభీరమై, ఆశయప్రభాకలితమై యుండును

ప్రకృతినుండి హృదయములోనికిని, హృదయమునుండి ప్రకృతిలోనికి అదృశ్యశైవలినివలె భావనావేశము ప్రవహించును. దీని వీచికలందే రెండును గలిసికొనును. కావుననే కళోపాసకుడు ప్రకృతిని జూచి తన్మయచిత్తుఁడై పోవును. కళోపాసకుని గాంచి ప్రకృతియు పులకితశరీరయగును. హాయి జల్లుచు ఇర్వురు చిత్రఖేలనము సలుపుకొందురు.

శాంతికాంతులు అరుణగగనమున జాలువారుతఱిఁ ఎడద విప్పారఁ గేలుమొగిచి కళోపాసకుఁడు మధురగీతికలు పాడును. రంగారు కిరణపంక్తులందు బంగారు తలపులను నేలపుటపై రవికవి వ్రాయుటఁ జూచి, తన కల మాతని కిచ్చి, అతని భాష్యంతలేఖిని దాఁగొన నాతురంపడును! మృదుకరస్పర్శచే కసువు, వసుమతిని పులకితఁజేసి నవ్వులఁదును పువ్వులఁదను ప్రభాతమును కడపుచుండ రాగమయమైన వారి చెలిమి గాంచి ఆవేశభరితుఁడై కళోపాసకుఁడు శకుంతకాంతలను గవియ నంతరిక్షమున కేగఁడా? భావనావేశముతో నుచ్ఛలితమగు పక్షికూజితములకు నిజహృదయతంత్రుల గీతికారవములను లయగా సమాకరించి తన్మయనృత్య మొనరించుచు జగన్మోహనుఁడైన కవికుమారుఁడు సృష్టికాంతను హృదయమునఁ జేర్చుకొనఁడా? మినుకులీను రవిభావములను పువ్వు పడుచులు దిగమ్రింగుట జూచి కడు కాంక్షతో నాతఁడు వాని దాపలఁ జేరి సౌందర్యభిక్షను వేఁడుకొనఁడా? పూపడంతుల మోములకు కన్ను లప్పగించి ఆవేశభరమున పరిమళపూరమునకు మానసాధరము నొడ్డుచు, ఈసున సమీరుఁ డెల్లకడలందు గుసగుసలు సల్పుటఁ దిలకించి, సిగ్గున పొదరిండ్ల మఱుఁగున కరిగి కవియువకుఁ డందు కులుకుచుండఁడా? అపరంజి మరీచికి మన నిచ్చిన మంచుతుంపుర మణికాంతులను నగుచుండ, బిందుసుందరి హృదయము జొచ్చి, పరవశుఁడై కాంతిరాశులను తలఁబ్రాలు గావించుకొనఁడా? ఈ గుట్టుఁ జూచి తన కేళిని యూకొనక కుసుమాధరముఁ గ్రోలుచు మందరవమున ప్రణయినికి భ్రమరవరుఁడు దానిని దెలుపుటఁ గాంచి కినిసి, కవి తుమ్మెద వైతి పాడుచుచు పాటలు పాడఁడా? గూళ్లమీఁది పచ్చందనపు పూఁతపై పైడి రంగులు తళ్కొత్తినంతన, ఆకుగముల మాటున దాగి కళోపాసకుఁడు పిట్టబిడ్డల తియ్యని కుహూరాలకు వీనుదోసి లొంగి హాయినందఁడా? రసపూరితఫలములు నిండురూపముల హృదయములపై నొప్పారఁ, దీవయిల్లాండ్రు తోఁచినంతన, రసపిపాసువైన కవి ఆతురపాటున దొంగచూపుల నాదెస సారింపఁడా? అదిగాంచి, ఈసున రవికవి వాని తలఁపులను క్రొందళ్కులందుఁ బట్టబయలు గావింపఁడా? నిశీధినీని సబ్ధతయందును, నీరంధ్రనీరదములందును తన తలఁపులను ముంచుచుఁ దేల్చుచు, ఆఁడుచు పాడుచు, నవ్వులు రువ్వుచు ఆనందవ్రతుఁడు నాకమును, నందనమును హృదయమున నింపుకొనఁడా? చెర్వుకెరటాల దేలుచు, కౌముదీపూరమున మునుఁగుచు పవనువలన నుడుపతికి ప్రేమసందేశ మంపుచు, ఫుల్లవదనలైన కుముద్వతులఁ గాంచి పులకితచిత్తుఁడై సరోవరతీరమునకు పర్వెడి, మఱిపుట్టువున తాను కల్వయై పుట్టవలెనని కవి తపసు చేయఁడా? వరుని జూచి మోహిత యగు వధువువలె కవిని గాంచి ప్రకృతి సీమంతిని హృదయము విప్పి తన సౌందర్యము నాతని వశ మొనరింపదా? భావనావేశమున కవి ఆనందమునం దీఁదులాడఁడా? పాలకరళ్లందు ఈఁదు సృష్టికర్తవలె ఆనందవీచికలం దీఁదులాఁడు కవి ఎన్ని యద్భుతములను సృష్టింపఁడు? భావనావేశమున నడచువాని కలము తరళకాంతులను విరఁజిమ్మదా? మనోహర

రూపులఁ గను లెమటఁ బెట్టదా! సాహితీయారాముమున కమనీయ కళాబదనికలను నాటివేయదా! వసుమతిని రసవాహినులం దోలలాడింపదా? స్వోత్కృష్ట కళావిన్యాసములు భావనావేశమునఁ గదా తలసూపును! రాతిని కూడ రసమయము చేయునది, కటిక చీకటిని కూడ కళాసందీప్తము గావించునది, కంకాళమున జీవకళలు నింపునది, హృదయమును మీటి విశ్వసంగీతము వెడలించునది, సచ్చిదానందములను మూడుగ్రుక్కల ఆపోశనముఁ జేయించునది భావనావేశము కాక మఱేది?

సాహితీ సామ్రాజ్యమందును, మనుష్య జీవనమందును విశేషప్రశస్తిఁ గన్న "రసములరాజు" శృంగారరసము భావనావేశమున నుబుకినదే! ప్రాచీనకవులు జడలే దాల్చినను తమ హృదయములందు సుధాబంధురవల్లరులనే పెరుఁగనిచ్చిరి గాని డొంకలఁబోలు జడలను గాదు కెంపుతలపులు చిప్పిలు అలరు విరులను దురిమి తమ జడలను సురభీకరించిరి గాని అందు వల్మీకములను పెరుఁగనియ్యలేదు. నిహితప్రకృతినుండి కూడ సౌందర్యమును కొల్లగొట్టువారు కావున మునిముచ్చు లని వరూథిని వారిని గేలిచేసినది. శోకధారలను జాలువార్చునపుడు కూడ నా కళావ్రతులు కలస్వనమున రాగాలాపన మొనరించువా రని వీణాతంత్రుల బోలి తీపి తుంపురులు రాల్చు వారి రచనపంక్తులే తెలుపుచున్నవి. దుఃఖమున దొలుకాడు ఘట్టములకు గల శృంగారరసవాహినులు స్రవించుచుండునని రామాయణమును తెఱచినవా రెఱుఁగుదురు. వాల్మీకి హృదయము రసపూర్ణమేఘ మని ఎఱిఁగియే వానకోయిలయై కాళిదాసు దాని నాశ్రయించినాడు, పిదప దన హృదినుండి మెఱపుల వర్షము గురిపించినాడు. శృంగారమును ఆనందమును, సౌందర్యమును కవిహృదయమున నూరించు అద్భుతశక్తి యేది? భావనావేశము కాదా?

కవితావేశము ఏకొలఁదిమంది హృదయములందో మందాకినీవీచికల నుప్పొంగించును. సంగీతమట్టిది కాదు. "రహిమీర యంత్రగాత్రముల రాల్ గరగించునది" విపులగాంధర్వము. మానవులకు మృగములకును దేవతలకును దానవులకును నొకే భాష యైనది గానము. అనురాగము ఆనందము, సంక్షోభావము సంగీతమున నుప్పొంగు భావనాబుద్బుదములు. గీతకళలు స్వరమునకు మెట్టు లని రవీంద్రుఁడు వాకొనెను. సామగానము జేయుచు ప్రాచీనులు నృత్యము సలిపిరి. నారదతుంబురుల నాట్యకౌశలము పురాణప్రసిద్ధము. కృష్ణుఁడు నృత్య మొనరించి వైకుంఠమును భూతలమున నిలిపినాడు విశ్వమోహననృత్యము సలిపి నటరాజు సృష్టిమహత్త్వమును తేటపఱచినాడు

కవిత్వనృత్యములందు వలెనే తక్కుంగల కళలందును భావనావేశము చూపట్టును. శిల్పకౌశల్యమును చిత్రలేఖనానైపుణ్యమును దీనివలననే తేటపడును. ప్రాచీప్రతీచీ జీవనముల నుప్పొంగు భావములను రవివర్మ రాఫేలులు తమ చిత్రములందు చిత్రించిరి. రామారావు రామమోహనులును ఆనందమోహనానందలాలులును, అవనీంద్రరవీంద్రనాథులును అధునాతన మానవహృదయములందు పొంగిపొరలు తలఁపుకరళ్లను తమ రంగులందు చిమ్మి పృథ్వికంతేని ఆనందభిక్ష నొసగిరి గతభారతమహత్త్వమున గొండొక వడిచరింపఁదలఁచువారు అజంతా ఎల్లోరా గుహలందును బృందావనభువనేశ్వరమందిరములందును బుద్ధగయదాక్షిణాత్యదేవాలయములందును ప్రవేశింపవలెను. తక్షశిల మొహెంజొరా జింటూరా సారనాథములందు నేఁడు వెల్వడు శిల్పభాగ్యమును గాంచి అద్భుతప్రాచీనయుగమున మసల గలిగితిని. స్థలకాలపరిమితులను ధిక్కరించి అనంతశోభ ననంతకాలమునకు ధారవోయు తాజ్ మహాలును చూచి భావనావేశమున గంతులిడనివా రెవరు! ఈయాదేశము కతన అద్భ

శ్యభావములు దివ్యదృశ్యము లగుచున్నవి. కళా జగతి యందును, ప్రత్యక్షవసుమతియందును అవతరింపఁ గలుగు చున్నవి. మృత్యువునఁ గూలిన సంఘటనములకు సంజీవి నిచ్చి చిరంజీవములు చేయుచున్నవి బాహ్యాంతరజగతులకును త్రికాలములకును వియ్యమును నెయ్యమును గూర్చు కళకు ఆయువు భావనావేశము

వక్తృత్వమును కళలలోనిదే. కళాహృదయుఁడు కాని వక్త మాటలు వట్టి గొడ్డు ఆప్పళ్లుండును. కళోపాసకుని పల్కులు శ్రోతల హృదయములను పరమహంసలను చేయును. ఉపన్యసించు సరోజనికిని పద్యపంక్తులందు పరుగులిడు సరోజనికిని భేదములేదు. మధుమయమైన సరోజని హృదయ మావేగముతో రవ్వురివ్వు మనుచుండును. భరతపక్షిని గూడి షెల్లీ కవీంద్రుఁ డెగసినట్లును, కోకిల వెన్నంటి మహాకవి కీట్సు అడవికొమ్మలందు (On the viewless wings of Poesy) ఎగసినట్లును, శబ్దపక్షవిక్షేపమున సరోజని ఎగసి శ్రోతలను గూడ నందనవనమునకు గొంపోవును. సురేంద్రుఁ డుపన్యసించుచు మేఘములతో మద్దెలలు మ్రోగించువాఁడు. శబ్దడోలికలందు భువనముల నుర్రూఁతలూఁగించు జగద్ధాత్రి బీసెంటుసతి యని సభ్యప్రపంచ మెఱుఁగును. నారాయణదేవు హృదయమునుండి ఆంధ్రమేఘములు సలుపు గర్జనలను మనరాష్ట్రీయు లెఱుఁగుదురు.

కళోపాసనమునకు వలెనే ఆధ్యాత్మికజీవనమునకును ఆవేగ మవసరము. కళ అనురాగమయమైనది. ఆధ్యాత్మికజీవనము భక్తిపూరితమైనది. అనురాగము నుండియే భక్తి జనించును. చెప్పనేల? అనురాగమే భక్తి యగును. భక్తియే అనురాగమగును. కృష్ణునెడ ననురక్తయైన రాధకంటె నెక్కుడు భక్తురాండ్రున్నారా? రాగవల్లరులందు బంధింపబడిన గోపికలు భక్తికి మేలుబంతులు కారా? శశికిరణములట్లును, గీతకళలట్లును, కవిభావములట్లును అనురాగలతికలు సౌందర్యసందీప్తములై ఆవేగభరములై యుండును. కృష్ణచైతన్యుఁడు "నాథా! నాథా!!" యని శ్యామసుందరుని సంబోధించుచు, ఆత్మవిస్మృతుఁడై నదియాలో నృత్యము సలుపుచుండువాఁడు. భక్తిపూరితహృదయుఁడై "మాతా! మాతా!!" యని దక్షిణేశ్వరమున రామకృష్ణుఁడు గంతులు వేయువాఁడు. ఆనందావేశుఁడై రక్తారుణపూర్వదిక్కును చూచి అడవిజాతి వాఁడు నృత్యము సలుపువాఁడు. కళాసౌందర్యమును గాంచి జర్మని షేక్స్పియరు గంతులు వేసినాఁడు. ప్రేమికులకును, కవులకును, భక్తులకును, గాయకులకును, చిత్రలేఖులకును, వక్తలకును, వీరులకును, శిల్పులకును, ఆవేశమును ఉద్రేకమును లేకున్నయెడల బ్రదుకే లేదు. అనురాగమునకు ఆయువు ఆవేగము. భక్తికి ప్రాణము ఆవేశము

గురుకార్యములు, చతికిలపడి యోచనాని మగ్నులైన వారికి, గాక ముందంజవేయువారికి సాధ్యమగును. మతగ్రంథములను తెరువుఁడు—చరిత్రలను చూడుఁడు. వీనియందలి మహనీయులును, వానియందలి మహాత్ములును ఎట్టివారో పరికింపుఁడు. ప్రజాసమూహములను వాగలల నూగించి కటికి రాళ్లచే సయితము ఘనకార్యములు చేయించిన మహాపురుషులు ఆవేగపూరితులు కారా? కృషికకులమునఁ బుట్టిన మార్టిన్ లూధర్ పదునేనవ శతాబ్దమున, పాపభూయిష్టమైన యూరపుఖండమును తలక్రిందులు చేసి ఆవేశమయుఁడై మతమహత్త్వమును పునరుద్ధరింప లేదా? రసపుత్రవీరులును రసపుత్రరమణులును అద్భుతక్రియలను నెఱపి, భావనావేగము కతనఁ గదా శతాబ్దులపైఁ గీర్తిచంద్రికలు వెదఁజల్లిరి! థెమిస్టకస్, ఎపమినన్డస్, లియునిడస్, హేనిబల్, సీజరు, అలెగ్జాండరు లాది మహావీరులు భావోద్రేకమువలనఁ గదా అసాధ్యములను పడఁదన్ని, నింగి చుక్కలను వెన్నముద్దలట్లు నంజుకొనిరి? మనుష్యమాత్రు లెక్క చూడని ఇటలీతుపా

శాద్రిపై (Vide· Abbot's 'Life of Napoleon') లేడిదండు లట్లు తన దండులను దుమికించి, నిఘంటువునుండియు, ప్రత్యక్ష ప్రపంచమునుండియు అసాధ్యమును పాఱదోలి, తీక్ష్ణదృక్కులచే నింగి చుక్కలను వశకించి, (Vide: Byron's famous Poem on Nopolean Bonaparte) ఎల్బాదీవినుండి మహోదధియం దుఱికి హుమ్మని ఉత్తాలతరంగములను పిడికిటఁ బట్టి, ఒక్క తన్నున యూరపుదేశమును అట్టిట్టు లాడించి సింహసేనల కడలు పుట్టించి, వీరులందు వీరుఁడై మనుష్యులందు మనుష్యుఁడైన నెపోలియనును నెపోలియనుఁ జేసినది భావనావేశము కాదా? సన్యాసి యైన సవ్యసాచి హృదయమున భావోద్రేకమును పురికొల్పియే గదా గీతాచార్యుఁ డాతనిచే గాండీవమెత్తించి కర్మక్షేత్రమున వాని నగ్రసరుఁ గావించినాడు! కమలకాసారమున లంఘించు రాజహంసవడువున, (Vide: Sakka's Palijataka) శిశువును రక్షింప భయదజ్వాలలందు దుముకు జనయిత్రికి ఉత్సాహవేగము లిచ్చునది భావనావేశము కాదా?

ఇది మేధాశిఖరములందుఁ బుట్టినది కాదు.— హృదయ ఉదధియందు ఉత్తుంగతరంగములై పొంగునది. కళను తనుపు భావోద్రేకమును, పరమహంసను తన్మయచిత్తుఁ జేయు భావనావేశమును, ఘనకార్యములను అరచేతఁ బట్టించు భావనావేగమును హెచ్చుతగ్గులు కలవి గాని వేర్వేఱైనవి కావు. కవితారసమున నుప్పొంగునవి మృదువీచికలు. వీరరసమున నుప్పొంగు అలలు కొండలవంటివి. భక్తిరసమున దొల్కు కెరటాలు మలయహిల్లోల వాక్కులఁ బోలునవి. చెప్ప నేల?— రసము లన్నిఁటికిని ఆశయము లన్నిఁటికిని మూలవిరాట్టు భావనావేశము! కళాకౌశలమునకును, ఆత్మకైవల్యమునకును కన్నతల్లి భావనావేశము. పురుషార్థములకును, పరమార్థమునకును ఆధారము భావనావేశము. శూరుని సృష్టికిని, సంయమీంద్రుని సృష్టికిని, ఆనందవ్రతుని సృష్టికిని, సృష్టికర్త సృష్టికిని ఆయువు భావనావేశము.

కంట్రాక్టు డ్రామా* అసంపూర్ణ రామాయణం

మల్లాది అవధానిగారు

(ఈ ప్రహసనం మొదటి సారి ౧౯౩౨ లో విజయనగరం మహారాజావారి కాలేజీ వార్షికోత్సవసందర్భంలో బి. ఏ. క్లాసు విద్యార్థులచే ప్రదర్శింపబడింది. తరవాత నిది బరంపురం గ్రాడ్యుయేట్లచేత శ్రీ గిడుగు రామమూర్తిపంతులవారి సప్తతిమహోత్సవసందర్భంలో రాజమండ్రిలో ప్రదర్శింపబడింది. వారిచేతనే వైజాగు, విజయనగరం, బరంపురం యింకా యెన్నో చోట్ల ప్రదర్శింపబడింది. ౧౯౩౩ లో వైజాగులో విశ్వకళాపరిషద్వార్షికోత్సవసందర్భంలో బి. ఏ. ఆనర్సు విద్యార్థులు కొందరు ప్రదర్శించారు.)

* * *

(తెర యెత్తగా వృత్త స్టేజీ కనబడుతుంది. దాని మీద రెండు యినపకుర్చీలు మాత్రం వుంటాయి.

* అన్ని హక్కులూ అవధానివి.

వెనక అడవి సీనూ స్తంభాల బొమ్మలు గల సైడ్కర్టెనులూ. దశరధుడు మెల్లగా నడుస్తూ వస్తాడు. మనిషి సన్నంగా ఆరడుగుల ఎత్తుగా వుంటాడు. మొహానికి మాత్రం సఫేదు పూసుకున్నాడు. మెడకి చెవులకి చేతులకి రంగు లేదు. నెత్తిని తెల్ల చింపిరి జుట్టు విగ్గుంటుంది అది మాటిమాటికీ అతని నుదుటిమీదకి వొరుగుతూ వుంటే అతను దాన్ని సర్దుకుంటూ వుంటాడు నల్లని మీసమూ తెల్లని గెడ్డమూను. చాలీచాలని వొక చింకి షెరాయి. పైని చెమ్కీ వూడిపోయిన మొహమలుకోటూను. చెవులకి లింగులింగు మంటున్న లోలాకులూ చేతులో కర్రకత్తీ వున్నాయి మెళ్లో వొక రుద్రాక్షల పేరూ గన్నేరు పూల దండా వున్నాయి దశరధుడు స్టేజి నడుమ వొక నిమిషం నిలుచుని 'ఆఁ' అని రాగం తీయడ ప్రారంభిస్తాడు. ఆరాగం పాటలోకి దిగుతుంది. పాట పాడుతున్నపుడు కర్రకత్తితో అడవిసీనును చూపుతూ వుంటాడు.)

దశ—(పాట)

వారె వారే శయ్యాగార మెంతో కడు వింత గొల్పె నాహా।

(పాట అయిపోయిన తరవాత)

నేను దశరధుండను నృపశ్రేష్ఠుండను. నా రాజ్యంబు గోసల యనునది. దాని ముఖ్యపట్నంబు అయోధ్య యనంబడు. నాకు మువ్వురు భార్యలు కలరు. పెద్దభార్య పేరు కవుసల్య—రెండో భార్య పేరు సుమిత్ర మూడవ భార్య యొక్క నామంబు కైక. కైక నాచిన్న భార్యయును ముద్దు భార్యయును ఐ యున్నది. ఇట్లుండగా పాపము నాకు చాలాకాలము వరకునూ పిల్లలు లేకపోయిరి. అపుడు నేను యొక యాగము చేసితిని. దానినే పుత్రకామేష్ఠి యని పెద్దలు వాక్రుచ్చుచుందురు. అందుచే నాభార్యలు ముగ్గురును అనగా కౌసల్య, సుమిత్ర కైకయును గర్భమును ధరించిరి. తొమ్మిది నెలలును నిండిన వెనుక సదరు భార్యలు మువ్వురునూ నలుగురు పుత్రులను కనెను. ఆనలుగురు పుత్రులును మొగవారలే వారే రామలక్ష్మణభరతశత్రుఘ్నులు. ఇట్లు దశరధుండ నగు నేను నా మూనావ నా కొమాళ్లతో కలిసి సుఖంబుగా ముదం బొప్ప నా ప్రజలను కన్నబిడ్డల వలె పాలించుకొంటూ యున్నాను. ఈరోజున నేను కొలువు తీర్చి యున్నాను గనుకనూ, యీ అయోధ్యకు నేనే మహారాజును గనుకనూ నేనిపుడు పోయి ఆనవరత్నఖచితసింహాసనంబున చెతోమోదరహితంబుగ కూర్చునెద గాక. (పోయి యినపకుర్చీలో కూచుంటాడు.)

(పాట పాడుతూ, పాటకు లయగా చప్పట్లు చరుస్తూ కళ్ళు మూసుకుని మంత్రి వొస్తాడు. తలను విగ్గు లేదు గాని వొక చెమ్లా వుంది. ఫ్రెంచికట్టు మీసం. గిల్టుఫ్రేము కళ్లద్దాలు వెయిస్టుకోటు. సైను లాల్చి. బైరాగి మల్లుపంచె గుండారు. కాళ్లకి కల్కొటా స్లిప్పర్లూను. ఇతను మాట్లాడే టప్పుడల్లా యెడమచేతిని పైకెగురవేస్తూ వుంటాడు.)

మంత్రి—(పాట)

మేరే మౌలా బులాలో మదీన ముఝే ॥మే॥
ధనము చేతుల దుముకుచుంటే
దగ్గరా చుట్టాల మందురు
ధనము కాస నశించి నంతనె
తరలిపోవును యెల్లవారలు ॥మే॥

(పోయి రెండో యినపకుర్చీలో కూచుంటాడు)

దశ—ఇపుడు సభామధ్యంబున తధ్యంబుగా సింహాసనంబున కూర్చున్న దశరధమహారాజులుంగారి నగు నే నేమి చేయవలసి యున్నదీ? క్షణము ఆలోచింపవలయును. (ఆలోచించి) ఆఁ. మంచి యూహా చటాలున స్ఫురించినది. ఇపుడు నేనితనిని మంత్రీ యని చక్కగా పిల్చెదను గాక. మంత్రీ! సరియే! అనుకొని నట్లీతనిని మంత్రీ యని పిలిచితిని. ఇంక యిపు డేమి చెయవలసి యున్నది? మంచి యూహా! (స్టేజి మధ్యకు వచ్చి సభ్యులను ప్రశ్నించే టట్లు చేయి తిప్పుతూ—)

(డైలాగు)

నెలకు మూడు వర్షములు కురియుచున్నవా?

మంత్రీ! కురియుచున్నవా!

మంత్రి—నెలకు మూడు వర్షములు కురియుచున్నవి రాజా కురియుచున్నవి!

దశ—నేను ప్రజల బిడ్డలట్లు యేలుచుంటినా? మంత్రీ యేలుచుంటినా?

మంత్రి—నీవు ప్రజల బిడ్డలట్లు యేలుచుంటివి రాజా యేలుచుంటివి!

రాజు—చందమామ లాగు రాము డెదుగుచుండెనా? మంత్రీ యెదుగుచుండెనా!

మంత్రి—చందమామ లాగు రాము డెదుగుచుండెనూ రాజా యెదుగుచుండెనూ?

దశ—మంత్రిసూర్యమా! మన రాజ్య మెట్లున్నదో చెప్పుమా!

మంత్రి—ఓయీ రాజా! యేమి చెప్పం గలవాడ? చెప్పుట కేమి యున్నయది? చెప్పుటకు నోరు రాక యున్నది

దశ—వర్యా! అది యెందుచేతనో గదా?

మంత్రి—రాజేంద్రుడా! నిన్ను వర్ణింప నాకెంతయో కోలాహలముగా నున్నది. నిన్ను వర్ణింప నా డెందంబు ఆందోళనాకందళితం బగుచున్నది. గాని నిన్ను వర్ణింప నాలుగు చేతులు గల అవిష్ణుమూర్తి కైనను దరము కాదు సుమా!

దశ—మంత్రిపుంగా! అలాగునా? పోనిమ్ము యథాశక్తిగా వర్ణింపగదవే. చవితిచంద్రునకు నూలు పోగు.

మంత్రి—భూసురగ్రామణీ! అయిన శ్రద్ధాభక్తులతో నాలకింప గదవే.

దశ—మనమా! యేల నికీ యారాటము? ఏల నీకీ తొందర? ఇతడు యిపుడు సంశయించుచున్నాడే? ఇతడు నిజము బల్కునా? బల్కననుకొందము. కీడెంచి గదా మేలెంచవలయును? ఇతడు నిజమును బల్కడనుకొందము. అపుడు మన మేమి చేయవలయును? మంచి యాలోచన స్ఫురించినది. ఇతనిని నిజమునే బల్కుమనెద గాక. అట్లు చేసిన ఇతడు నిజంబునే బల్కగలడు. మదించి చెట్లను పెల్లగించు చున్నటువంటిన్ని గబగబ పరుగెత్తగలిగినటువంటిన్ని మాంచి తొండము కలిగినటువంటిన్ని చేటలవంటి చెవులతో వుండుకున్నటువంటి యేనుగువంటి మనిషి వయిన యోమంత్రీ! నీవిపుడు దయయుంచి నిజమునే బల్కుము. అబద్ధంబు బల్కజనదు. సత్య మేవ జయతి నానృతం!

మంత్రి—(చిటాల్న లేచి నిల్చుని యెడం చెయ్యెగరేస్తూ స్థిర మైన నడవడీ జనుల కందరకునూ వలయునే రాజ్యచాపల్యమననూ" అనే పద్యాన్ని వుద్రేకంతో చదివిన వెనుక—) గనుక నే నబద్ధమాడెదనా? ఎంతమాట నంటివిరా? అపురా! వినుము.

గీ॥ దశరథుడ వైన రాజేంద్ర విశదముగను
అలరు బల్వుల్కులను నీకు తెలియజేతు
విశ్వమందున నీకీర్తి వెలయుచుండె
అందముగ నెల్లచోటుల అహహా యరయ

(పైపద్యాన్ని విచారకరమైన రాగంతో పాడి యేడుస్తూ దశరథుడి పాదాలమీద పడిపోతాడు)

దశ—మెచ్చితిని. మెచ్చితిని. ఓయి సచ్చరిత్రా! నీవిచ్చకము బల్కక అచ్చసచ్చము నే వాక్రుచ్చి నాయిచ్చను నచ్చచెప్పితివి గావున నీకిదే అచ్చర లచ్చలిచ్చుచున్నాను బుచ్చుకొనుము.

(అని తన మెళ్లోని రుద్రాక్షల పేరు అతని మెళ్లో వేసి నమస్కారం చేస్తాడు)

మంత్రి—ఓకీర్తిశేషుడా మరియు—

గీ॥ ధరను నీకును కౌసల్య ధర్మపత్ని—ఓయికీర్తిశేషుడా మరియు
కిన్నుఛముహూర్తమున నొక్క కొడుకుబుట్టె

దశ—(తలవూపుతూ) అలాగునా!

మంత్రి—

గీ. వాడె శ్రీరామచంద్రు డన్వాడు వాని
కీర్తి నీ కీర్తి—ఏమి రాజా వినుచుంటివా లేదా?
నీకు చెము డేమో మరల చెప్పుచుంటిని వినుము

గీ. కీర్తి నీ కీర్తి క్షణములో గెలిచె నరయ

దశ—హా! నెంత గోర మెంత గోరము! (దుఃఖాలున మూర్ఛిల్లుతాడు)

మంత్రి—

ఉ॥ చచ్చిరి సోదరు ల్సుతులు చచ్చిరి.........
......బిచ్చెద జీవితేచ్ఛ కల దేని బయల్పడు
మయ్య గ్రక్కునన్

కావున కష్టములు మానవులకు గాక జంతువులకు వచ్చునొక్కొ? వూరడిల్లుము. వూరడిల్లుము.

దశ—ఇంకేమి వూరడిల్లుట? నాబ్రతు కంతయు తుద కిట్లొక క్షణంబున దగ్ధ మగు నని మంట పాలగు నని కలయెం దయిన దలంప నయితినే. కట్టా! ఒక్క కొడుకు—హా!

మంత్రి—ప్రియా! దశరథా! ఎంత యేడ్చిన నేమి లాభము? ఏడ్చి నంత మాత్రమున చనిపోయిన వారు తిరిగి వత్తురె యెంచి చూడగన్. మనకు కష్టకాలము వచ్చినది భరింపక దప్పునొక్కొ యీభూమీస్థలిన్.

ఉ. చల్లనివై శ్రమం బుడుప జాలిన తామరపాకు
వీవనల్
.........ఓపల్లవపాణి—

దశ—(సిగ్గు నభినయించుతూ) చాలును లెండు (లేచికుర్చీలో కూచుని) మంత్రిగ్రామణీ యేమి విశేషములు?

మంత్రి—మన దేశమునందు ప్రజలు మిమ్మే తిండీ తిప్పలూ మానుకుని యెల్లవేళలా హృదయంబులందు ధ్యానించుచున్నారు.

దశ—ఇట్టి శుభకబురు, తెచ్చినందులకీ హారంబు గైకొనుము (అని తన మెళ్ళోని పూలదండను తీసి అతని మెళ్లో వేస్తాడు.)

మంత్రి—రాములవారి కీర్తి మీకీర్తికంటె నూరామడలకు ముందున్నయది సుండీ!

దశ—ఇట్టి అశుభకబురు తెచ్చినందులకు నాఅచ్చురలచ్చులున్న నాహారంబును నాకిచ్చివేయుము. (అని తానే మంత్రి మెళ్లోనుంచి రుద్రాక్షలహేరూ పూలదండా తీసుకుని తన మెళ్లో వేసుకుంటాడు)

(గడియ నిశ్శబ్దము)

(చరచర లోపల్నుంచి సేవకుడు వొస్తాడు. వలంగా వుంటాడు. బొద్దుమీసాలు చేతిలో లారీకర్ర)

సేవ—(పాట)

ఈశ్వరా సంకల్ప మెవ్వా రెరుంగుదురూ?

... ...

హా దైవమా! హా హతవిధీ! హా లోకమా! భరతమాతా! నాకు. నాకేది గతి? యెటుల బ్రతుకువాడ? ఇపుడీ ఘోరవార్త వీరి కెట్లెరిగింతు? అయ్యో! ఈవార్త వినిన వీరు గుండె పగిలి చావరా? చచ్చిన చావనిమ్ము. నావిధి, నాపనిని నేను చేసెదను. నేను సేవకుడ నగు' నేనే నానాలుకతోనే చెప్పివేసెదను. ఓహృదయమా పిరికితనమును పారద్రోలుము. ఓదిగ్గజములారా! మీరును ధైర్యముతో నిలువుడు. ఓభూమీ! నీవును ధైర్యముతో కంపింపరాదు. ఓసర్వేశ్వరా! యీవార్త నెరింగించుటకు నానాలుకయం దింత బలమును ప్రసాదింవే. హా! నే నిపు డీతనిని యేమని బిలువగలను? దశరథా! యిటురా. (దశరథుడువచ్చి సేవకుని దగ్గర వినయంగా నిలుచుంటాడు) నానోరు బెరడుకట్టుచున్నది. నాకళ్ళు గిర్రుగిర్రున తిరుగుచున్నవి. అహా! కాలగతి దాట నేరి తరము? హా భరతమాతా! నీకట్టి గతి పట్టినది! (వలవల యేడుస్తాడు) హా! చెప్పుచున్నాను. నానాలుకతోనే నానోటితోనే చెప్పివేసెదను. దశరథా! నాయనా! కుమారా! యిటురా! నీవు బాలుడవు. భయపడకుమా. నేను చెప్పబోవు ఘోరవార్త విని చచ్చిపోకుమా!

ధైర్యము తెచ్చికొనుము. ఏల యేడ్చెదు? నీకొక భీషణవార్త నెఱింగించెదనులే.

దశ—సేవకోత్తంసమా! విశేషంబు లెయ్యవి?

సేవ—(తన తలను రెండు చేతులతోను పట్టుకుని) విశేషములు—విశేషంబులు_పిడుగు-పిడుగువార్త. ఈ నాగుండెలలో కనికరము లేదుగదా. వినుము—హా మనమా! ధైర్యము ధైర్యము! వచ్చు ... చు ... చు ధైర్యము! వచ్చుచున్నాడు—హా_విశ్వా—మిత్రుడు (వొక్క_ యెగు రెగిరి తెరలోపలికి పోతాడు)

(తెరలో పాట)

ధశరధా! ధశరధా ధశరధా

ఓరి మూర్ఖ! ఓరి శుంఠ! ధశరధా!

దశ—(పైపాటను వినుట నభినయించి మంత్రితో) పాట.

సలలితమురళీనినాద మే అది సందేహ మేలా?

లలితాలాప మదిగో—అదిగో విను సఖీ—మురళి

గను సఖీ ॥స॥

మంత్రి—రాజేంద్రమా! మునిచంద్రముం డగు విశ్వామిత్రరుషి మురళిపై హరినామకీర్తనాహారుపానము లుండ వాటిని దినుచు వచ్చుచున్నవాడు

దశ—

గీ. అయిన నీవిప్పుడే పోయి అతని దీసు

కొంచు రాగదవే వోయి మంచివాడ

మంత్రి—

గీ. ఏల నాతండె యిచటకు నేగుదెంచు

చుండె ననవసరం బది పుండరీక

(లోపట్నుంచి "ధశరధా" అన్న పాటను పాడుతూ వొక్క_పరుగున విశ్వామిత్రుడు వొస్తాడు. నల్లని విగ్గూ తెల్లని మీసమూ గెడ్డమూనూ. మొహానికి యెఱ్ఱ రంగు. ఒకయెఱ్ఱ బనియను తొడుగుకున్నాడు. ఒక బైరాగిమల్లు పంచి సైకిలు కట్టూ. ఎఱ్ఱసిల్కు_ వాణీ మెళ్లో వల్లెవాటు, మొలను సగం కనబడుతున్న పొడుండొక్కు_. చంకలో పంచాంగమూ ఒక చేతిలో జారీ యింకో చేతిలో తీగెలు లేని తంబురానూ.)

విశ్వా—(పాట)

ధశరధా! ధశరధా! ధశరధా

ఇంతవాడ వని తెలియగ నైతిని

పంతమ నాతో పంతులు ధశరధ?

బధ మాడక నబధ మాడితివి

సుధులు లేవా ఛీ ఛీ ఛీ ॥ధశ॥

దశ—(విశ్వామిత్రుని కాళ్ళపైబడి)

శ్లో. శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం

ప్రసన్నవదనం ధ్యాయే సర్వవిఘ్నోపశాంతయే

మంత్రి—(విశ్వామిత్రుని కాళ్లపైబడి)

శ్లో. సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ

విద్యారంభం కరిష్యామి సిద్ధి ర్భవతు మే సదా

విశ్వా—ఏమిరా కుంకా నాదగ్గర నటరా నీవక్క_ వినయములు. ఛీ హుమ్మ్.

దశ—(పాట)

తప్పు క్షమియింపుమా ఘోరతాపసేంద్రమ నా

తప్పు లన్నీ వొప్పులుగా తప్పకుండా తలచిమదిని

కప్ప వలే శపియింపక యిప్పుడె న న్బ్రోవుమా

॥త॥

మంత్రి—(పాట)

మునివరా తుద కీట్లూ ననూ మోసగింతువా!

॥ము॥

దశ—నన్ను క్షమియింపం గదే

విశ్వా—కుంకా! ఛడవా! వాచాలా! ద్రోహీ! మాతృహంతకా! సకలలోకభీకరాకారుండు నగునే నటరా నిన్ను క్షమింతును.

మంత్రి—విశ్వామిత్రమా! ఆగ్రహణము బొందనేల? మరియు—(పాట)

శాంతమూ లేక సవుఖ్యమూ లేదూ సారసాదళా

నయనా ॥శా॥ దాంతునీ కైనా వేదాంతుని

కైనా... ॥శా॥

విశ్వా—ఛీ! నీవును ప్రేలుచుంటివిగా కుంకా! అన్ని పాములను తలయెత్తగా లేడీ పామును తల యెత్తిన దట

దశ—బాగున్నది ఓయీ విశ్వామిత్రా! నీవు నన్ను క్షమించని పక్షమందు నే నెట్లు బ్రతుకు టోయి?

విశ్వా—అరె ఉల్లూ! యేమిరా ప్రేలుచుంటివి? మాతృహంతకా! పుత్రహంతకా! పితృహంతకా! గురుహంతకా! మునిహంతకా! (దశరథుని తలను తన కాల్తో తంతాడు(

దశ—నేడు గదా మదీయతల ధన్యం బయి యొప్పారు చున్నయది! అయ్యో దేవా కఠినమైన తమ పాదంబు మృదువైన నాశిరంబును దాకి గాయపడిన దేమో? యద్దానిని నాతాలూకు కన్నీళ్లచే కడుగనిండు

విశ్వా—ఓరి నటనసూత్రధారి! ఓరి ముసలి పీనుగా నీవు నాకాలు విరిచివేయుచున్నావుగా! నీవు నాకాలు విరిచివేయుచున్నావుగా! ఈ తంబూరాతో యిదిగో త్వదీయతలను బద్దలుచేయు చున్నవాడ. (తంబూరాతో తంతాడు)

మంత్రి—విశ్వామిత్రమా! రాజేంద్రముం డగు దశరథ నృపాలు నేల దన్నెదవు?

విశ్వా—ఏమీ పిట్ట కూత పట్టినదే? గుంట భడవా! నీకును యీ యొక్క తంబురతో తన్నులు గావలయునా యేమి? ఇదే నీయొక్క వీపు దుందను తీర్చివేయుచుంటి. (మంత్రిని నాలుగు తన్ని, దశరథుణ్ని చావగొట్టి) మూర్ఖా నిన్ను క్షమించితి నిరా

దశ—(ఆనందంతో లేస్తూ) హా హతోస్మి హతోస్మి.

విశ్వా—(వేలు గిర్రున ద్రిప్పి) బంపవా?

దశ—నేను వచ్చె—

విశ్వా—(కమండలంలో నీళ్లన్నీ దశరథుడి నెత్తిమీద పోసి) గీ॥ నేనె కుసికుని తనయుడ నేని—

దశ—అం? అం! శపించకలదు

మంత్రి—మాటిమాటికి శపింతు నని భయపెట్టెద వేల నోయీ?

విశ్వా—ఏమిరా శుంఠా! నీకు కూడ నాల్గు శాపాలు కావలెనా యేమి? (దశరథుని బుగ్గ పొడిచి) ఏమి మాటాడ—వేమిరా పశువా!

దశ—దశరథరాజేంద్రముండ నగు నేను అరవైవేల యేండ్లు చక్కగా రాజ్యంబు చేసితిని. అందు వలన యిపుడు ముసలివాడ నై యున్నాడను గనుకా—

విశ్వా—ఓరి ముసలి పీనుగా! (కమండలం అతని తలమీద బోర్లించి)
గీ॥ నేనె కుసికుని తనయుడ నేని—

మంత్రి—అం! శపింపవలదు. దశరథనృపాలా! విశ్వామిత్రుడు బస్సుపాటను చాలా బాగా పాడ గలడని వినియున్నవాడ. గనుక అద్దాని నతనిచే పాడింపుమా!

దశ—విశ్వామిత్రా! బస్సుపాట పాడి మమ్ముల ను ఆనందాగ్నిలో కాల్చివేయుమా!

విశ్వా—ఓరి శుంఠా! నేను అందరివలె గ్రామఫోనుపాటలను సబుబూ సందర్భమూ లేక పాడతా ననుకొంటివా? ఏమిరా మూర్ఖా! అసలు సంగతి యేమి చెప్పితివి?

దశ—పంపజాల! పంపజాల.

విశ్వా—గీ॥ నేనె—

మంత్రి—పంపుము రాజేంద్రా శాపములు తిన నేల?

విశ్వా—(ఆనందంతో మంత్రితో) మా మంచి మాటాడితివిరా శుంఠా! (దశరథునితో) ఓరీ ముసలి గాడిదా! లోకంబున ఆరుమార్గంబులు సామభేద ధన దండోపాయంబు లని వున్నయవి. అందు మొదటి అయిదును నీయందును ప్రయోగించితిని గాని లాభంబు లేకపోయె గాన నీపై నిదే

ఆరవ వుపాయంబగు దండంబును ప్రయోగించు చున్నాడను కాచుకోను (రెండు చేతుల్లోను తంబూరా పట్టుకుని దాన్ని దశరధుని తన్నడానికి పైకెత్తుతాడు.)

మంత్రి—(చటాల్న ఆతంబూరాను పట్టుకొని) శాంతింపు, శాంతింపుము. నీవు దశరధుని అట్లు శపింపరాదు. అతనిని నీవు తన్నరాదు అతనిని నీవు ముసలిగాడిదా యని బిలువరాదు. నీవు మాత్రము యౌవనుడవా యేమి?

విశ్వా—ఓరి భ్రష్టా ముష్టితుకునె జెప్పా! నీతో నాకేల యిష్టాగోష్ఠి? (దశరధునితో) క్రూరా! రఘువంశ సుధాకరా! నిస్సారా! సదాచారా! ఘోరాకారా!రిపుభీకరా! నీకుమార్గా! ఎందుకు రా బంపవురా?

దశ—విశ్వామిత్రా! కుశికసగోత్రా! ఆరంభ సూత్రా! అపాత్రా! ఘోరపవిత్రా! దుర్భర చారిత్రా? బంప నాదు పుత్రా! మనసు లేదు మిత్రా!

విశ్వా—గీ॥ నేనె కుశికుని తనయుండ నేని—

మంత్రి—విశ్వామిత్రా నీవు కుశికుని తనయుడ వగుట కేదేని సందేహ ముండియుండవలయును. లేనిచో పదేపదే అట్లేల యందువు?

విశ్వా—కాచుకో! కాచుకో!

దశ—శాపము వలదు, ఓరీ మంత్రీ అమృత మును విషము చేయక (అలస్యా దమృతం విషం) రామలక్ష్మణుల గొనిరమ్ము పొమ్ము.

మంత్రి—చిత్తము దేవరా (వెళ్తాడు)

(పటాప్సాక్షయశబ్దము. లైటు లారిపోతాయి. ఘోకసింగు రాముడు భూమిలోనుంచి పైకి లేస్తాడు. వలంగా వుంటాడు, పెద్దబొజ్జా, ఒంటి నిండా నీలిరంగూ, బొద్దుమీసాలూ, తలను అట్ట కిరీటం. చేతులో దసరా బాణం. కాళ్లకి మువ్వలూను)

రాము—(పాట)

అమ్మ నాకూ బంగారు బండి కొని యియ్యవే! బండి నేను యెక్కెద నెచ్చెల్చెల్చె ల్లొక్కెదన్॥అ

నేనే గదా సర్వేశ్వరుండను. నన్నే కొందరు మూఢులు విష్ణు వనియు, రాము డనియు, శివు డనియు అల్లా అనియు అల్లాటప్పయ్య అనియు యిత్యాది చాలా నామంబులతో పిలచుచుందురు. ఈమాయానాటకమునకు సూత్రధారుండను నేనే గదా. నేను త్రాగుచుందును. నేను త్రాగెడివి బ్రాండీ విస్కీలు గావు గోపికాగృహంబులందలి పాలు. నేనొకప్పుడు శయనించుచుందును; వేశ్యా గృహంబుల కాదు, గోపికాగృహంబుల. నామాయల నెవ రెరుంగుదురు? కంట్రాక్టరు యేభైయోని మిది రూపాయలూ కక్కకపోతే మొహానికి కోటూ అయినా శెయ్యని వీరాధివీరుడను నేనే గదా! ప్రస్తుతము నేను బాలకునివలె మెలగవల యును. అందునను పసిబాలునివలె మెలగవలయును. పాపము వృద్ధు డగు యీదశరధుండు నన్ను తన కుమారు డనియే నమ్ముకొనుచున్నాడు (దశరధునితో) నాన్నా! నన్నేమో నువ్వేమో! మలి మలి అమ్మ న్నావుత గా.

దశ—అవును రా నాకును కౌసల్యకును బుట్టిన కొడకా!

రాము—(మీసం దువ్వుకుంటూ) అయితే మలి, నన్ను నన్నెందుకు అమ్మన్నావు? నాకు బండి కొని త్తావు? ఏం నాన్నా? ఎంచక్కా నేనాడుకుంటాను? నేనూ తమ్ములూ బండెక్కుతాం వూలి కెళ్తాం. ఏం నాన్నా? అయితే మలేమో నువ్వేమో మిటాయుండ కొనియ్యవూ?

మంత్రి—అహా పల్కు లెంత చక్కగా నున్నవి. అవి కని విని తిని ఆనందింపవలసినవే గాని వర్ణింపవలసినవి కావు.

దశ—ఇంత అమాయకుని యింత పసిపాపను నేను ఎటుల బంపగలను. ఘోరఅరణ్యాలలో ము

ళ్ళుండవా? ఆముళ్ళు యితని కాళ్లలో గుచ్చుకోవా? ఆముళ్లను తీయుటకు అరణ్యాలలో మంగల్లుందురా? హా! విశ్వామిత్రా నీకు నాపై నేల దయ కలుగదురా?

విశ్వా—ఏల యేడ్చెదు? ఇందాక నన్నడిగితివే బస్సుపాట పాడమని. సమయమువచ్చినది యిపుడు. నువ్వు నన్ను శ్రీరాముని అరణ్యాలకు యెట్లు తీసుకు వెళ్లెద వని అడుగుము.

దశ—నీవు శ్రీరాము నడవుల కెట్లు తీసుకు వెళ్లెదవు?

విశ్వా—మూర్ఖా వినుము—

(పాట)

బస్సు పుట్టిందోయి బాబూ బస్సు పుట్టిందీ
ఆబస్సు పుట్టి బళ్లవాళ్ల కడుపు కొట్టిందీ ॥బ॥

అటువంటి మహాబస్సు నెక్కించి నీకుమారుని తీసుకుని వెళ్లెదను రామా నీవు నాతో అర్యంబుల కరుగుదెంచంగ వలయు. అక్కతమున నీవు త్వదీయ తండ్రియొద్ద సెలవుం గయికొమ్ము,

రాము—(తండ్రి దగ్గరగా జరిగి) నాకు బయమేస్తుంది.

విశ్వా—ఆదిమధ్యానంతరరహితా! నీకా భయంబు. గనుక జాగొనరింపక దశరధుని యొద్ద ఆజ్ఞ బొంది విశ్వామిత్రమహాముని నగు నావెంట రమ్ము.

రాము—ఆహా! వీరందరును వోరి మూర్ఖులను శుంఠలను యెందుకూ పనికిరానివారలే గదా! లేకున్న యెడల రాముండ నగు నేనాజ్ఞ బొంద వలయునా?

సీ. భద్రాద్రిరఘురామ భజనకు జనుచుండ
బంధుమిత్రుల యాజ్ఞ బడయ నేల? .
....

జనకశ్రేష్ఠమా! నేను ఘోరకీకారణ్యములకు అరుగుచుంటిని. తిరిగి మరలి వత్తునో రానో. మరల నిన్ను దర్శించు భాగ్యము నాకు కలుగునో కలగదో కదా? ఇవే నాకడపటి నమస్కారములు! (వలవల యేడ్చుస్తాడు.)

విశ్వా—(రాముడి వేపు కోపంగా చూస్తూ) శుంఠా! ఎంత ఆలస్యంబును చేయుచుంటివిరా (కమండవులోనికి తన చేతిని పోనిచ్చి)

గీ॥ నేనె కుసికుని తనయుడ నేని—

దశ—హా! శ్రీరామచంద్రా! రఘుకులాబ్ధి సూర్యా! రావణసంహారకా! జానకీనాధా! పాహిమాం! పాహిమాం! (వలవల యేడుస్తాడు)

మంత్రి—హా తనయా రామా! (యేడుస్తాడు)

విశ్వా—ఓరీ రామా యీతంబూరాను పట్టుకో. ఇప్పుడే మన ప్రయాణమునకు ముహూర్తమును పెట్టెదను (తంబూర్గాను రాముని కందిస్తాడు. ఒక్క పొడుం చిరా పీల్చి చంకలోని పంచాగం తీసి విప్పి, వొక పాత సులోచాలజోడు—కళ్లద్దాలు—తీసి కళ్లకు తగుల్చుకుని పంచాంగంలో నాలుగు కాగితాలు తిప్పి) ఆఁ. అమావాస్య, మంగళ వారం త్రిపాది నక్షత్రం, మధ్యాన్నం వొంటి గంట న్నరకి వర్జం, అనగా యిపుడు వర్జమన్న మాట. బ్రహ్మసృష్టికి ప్రతిసృష్టి యొనర్చిన నాకు వర్జముతో పని యేమి? ముహూర్తము చాలా బాగున్నది ఇక పద రామా!

దశ—విశ్వామిత్రా! వర్జముతో నా కుమారుని తీసుకు పోయెదవా?

విశ్వా—అవునురా మూర్ఖా. అయిన నీవే మందువు? మారు మాటాడిన శపించివేసెదను. (తెర లోనికి చూస్తూ కుడిచేయి పైకెత్తి గట్టిగా—) ఓప్రాకులారా! వినుడు వినుడు!

(పాట)

బలే మాంచి చవుక బేరమూ!
....

(పాటంతా పాడి రాగం తీస్తూ తెరలోనికి నడుస్తాడు.)

రామ — నేను తప్ప యీలోకంబున అందరును మూర్ఖులే గదా (అతను కూడా లోపలికి పోతాడు)

(మంత్రి, రాజు, పోక ర్నోకరు గట్టిగా కౌగలించుకుంటారు.)

మంత్రి — నాయొక్క బ్రతుకు బండ లయి పోయినది

దళ — నాయొక్క బ్రతుకే నీరయిపోయినది.

(మంత్రి 'పోవూచున్నాడే నావిభుని జీవము లనూ గొని?' అన్న పాటను పాడుతూ తెరలోనికి పరుగిడతాడు రాజు 'పోయె నయ్యో యిప్పుడు నన్ను శాసి ఆపాలతూల మిన్నా' అన్న పాటను సాంతెర్గా విరహాన్ని నటిస్తూ పాడి 'హా!' అని పెద్ద బొబ్బ పెట్టి దుభాలున మూర్ఛిల్లుతాడు తెర దుభాలు మని పడుతుంది.)

*　　*　　*

ఈవిషాదాంత ప్రహసనాన్ని, నేటి కంట్రాక్టరులకూ కంట్రాక్టునటకులకూ, ఆనాటకాలను చూచి పొంగిపోయే ప్రేక్షకజనానికీ, భక్తిపూర్వకంగా అంకితం చెసుకొంటున్నాను

వేయి స్తంభాల గుడి శాసనము

పరిష్కర్త:— విద్వాన్ కంభంపాటి అప్పన్న శాస్త్రిగారు

మధ్యయుగంనాటి ఆంధ్రదేశపు చరిత్ర కీగ్రంథం చాలాముఖ్య మయినది. కాకతీయరాజుల పూర్వ చరిత్రకు మూలస్తంభ మైన హనుమకొండ వేయి స్తంభాలగుడిలోని శాసనం ఇందులో సర్వతోముఖంగా చర్చించబడింది హనుమకొండలో ఒక పరిశోధకమండలిని స్థాపించి నైజాంరాష్ట్రంలో గల చారిత్రిక సామగ్రిని బయల్పెడలించడానికి కృషిచేస్తూన్న శ్రీ అప్పన్నశాస్త్రిగారు దీనికి పరిష్కర్తలు. ఈగ్రంథంలో పీఠిక, శాసనోపక్రమణిక, చరిత్రాంశములు శాసనమూలము, అనువాదము, అనుబంధము అని ఆరుభాగా లున్నాయి. ఇంతేకాక దీనిలో చక్కని పదిహేను చిత్రపటాలూ, మూడు దేశపటాలూ కూడా ఉన్నాయి.

ముద్రణము:— ఈగ్రంథం మేలురకం కాగితాలమీద ముద్రించబడింది. అయినా దీనిలో ప్రమాదాలూ, స్ఖాలిత్యాలూ ఎక్కువగా వున్నాయి. శుద్ధపత్రం యొక్క పరిమితి ఐదు పేజీలు. ఇదిగాక పీఠికలో మరికొన్ని సవరణ లున్నాయి. అయినప్పటికీ అనేకాలైన తప్పు లింకామిగిలి వున్నాయి. శుద్ధపత్రంలో పుస్తకం చదువుకొనేవారు కొన్ని భాగాలు చదవటం మానివెయ్యా లనీ, కొన్ని చోట్ల కొన్ని పంక్తులు మార్చి చదువుకోవా లనీ సూచించారు పరిష్కర్తగారు. ఇది పాఠకులకు చికాకుకలిగిస్తుంది. (చూ. శా ప, పే ౧, ౨, ౩, ౪) కొన్ని పేరాగ్రాఫులకు శీర్షికలు వేయబడలేదు. ఇందువల్ల ఒక విషయం ఇంకొక విషయం కలిసిపోవటం జరుగుతుంది. ఒక్కొక్కప్పుడు అనవసరంగా పాఠకులకి చిక్కు కలుగుతుంది. ఉదా. ౪౨ పేజీలో ౩ వ పేరాలో "రుద్రదేవుడు తన తండ్రినిఁ జంపె ననుట నిజమా?" అనే శీర్షికలో రెండవ ప్రోలరాజు మరణాన్ని చర్చించారు. తుదకు వెలనాటి రెండవ చోడరాజు ఇతన్ని చంపి

వుంటా డనే నాఅభిప్రాయాన్ని అంగీకరించారు. వెంటనే ౪౩ పేజీలో రెండవ పేరాను "ఇతని చావునకుఁ గారణము దేవగిరిరాజ్యాధీశు డైన జైత్ర పాలుడు"అని మొదలుపెట్టారు. ఈ పేరాలో చర్చింపబడ్డ అసలు విషయం ప్రోలరాజు కొడుకు రుద్రదేవుడి మరణం. చదివే వారికి మాత్రం పైపేరాలో ప్రోలుడి మరణాన్ని గురించి ఒక నిర్ణయం సి తిరిగీ దాన్ని గురించి ఇంకొక విధంగా ఎందుకు వ్రాశారా? అని సందేహం కలుగుతుంది. దీనికి కారణం యీరెండో పేరాకి "రుద్రదేవుని మరణము" అనే పేరా హెడ్డింగు లేకపోవటమే. ఇట్లాంటి పొరబాటులు ౬ మొదలయిన పేజీల్లో కూడా వున్నాయి.

అనుక్రమణిక:—ఈశాసనంలో వచ్చే వ్యక్తుల యొక్క, స్థలాలయొక్క చర్చ గల భాగానికీ, శాసనమూలానికీ కలిపి ఒకటే అనుక్రమణిక తయారుచెయ్యబడింది. దీనివల్ల కూడా కొంత చిక్కు పాఠకులకి కలుగుతుంది. కొన్నిచోట్ల ఒకే అక్షరం క్రింద వ్యక్తుల పేర్లూ, స్థలాల పేర్లూ, శాసనారంభ పదాలూ, శాసనాల మధ్యలో వచ్చే మాటలూ వస్తాయి. (చూ. "అ" లో 'అనుమకొండ' ౧,౧౦,౧౩ ఇది చారిత్రిక భాగంలోని మాటకు సూచన. "అనుమకొండ నామ నగరీ" ౬౭ శా. ప ౩౮, ౨౬ ఇది శాసనశ్లోకారంభ మధ్యాంత్యాలలో ఎక్కడైనా సరే వచ్చు మాటకు సూచన.) ఇంతకంటే శాసనమూలాని కొకటిన్నీ, చారిత్రిక భాగాని కొకటిన్నీ వేర్వేరు అనుక్రమణికలు చేర్చితే బాగుండేది.

చిత్రపటాలు:— ఈగ్రంథంలోని చిత్రపటాలు కాకతీయుల కాలపు కళాపరిణామాన్ని తెలుసుకోడానికి మిక్కిలి తోడ్పడగలవు. అయినా వీటిని గూర్చి ఒక మాట చెప్పవలసి వుంది. ఇందులో ౪, ౫, ౭, ౯, ౧౦, ౧౧, ౧౪ సంఖ్యలు గల చిత్రాలు ఏకశిలానగరానికి సంబంధించినవి. ప్రకృతశాసనంలో యీనగరం ప్రశంస యేమీ లేదు. పైపటాలు చేర్చడం అనవసర మేమో. వీటిలో ౧౧౯ పేజీ కెదురుగా వున్న చిత్రానికి ఇంగ్లీషులో "supposed Head of Prataparudra" అని రాసి కూడా తెనుగులో "...ప్రతాపరుద్రుని శిరస్సు" అని నామకరణం చేశారు పరిష్కర్తగారు ఇట్లా అనటానికి ఆధారాలు శాసనాల్లో గాని, వాఙ్మయంలో గాని ఏమీ కనపడవు. ఈశిల్పం పక్కనే వున్న ఒక లింగంమీద చెక్కబడి వున్న దేవతల ముఖాలతో పోల్చి చూస్తే యీశిల్పం ఒక మనుష్యుని దనీ, బహుశః ఒక రాజు దనీ తెలుస్తుంది అంతే కాని ప్రతాపరుద్రుని శిర స్సిది అని అనటాని కాధారం లేదు. (ఈశిల్పపుచిత్రాన్ని ౧౯౩౨ ఏప్రిల్ భారతిలో నేను ప్రకటిస్తూ "రాజు తల"అని వ్రాశాను.) అంతే కాకుండా యీగ్రంథంలో వుండే యీ శిల్పం యొక్క బ్లాకు పాఠకులకి ఒక తప్పు భ్రమ కలగజేస్తూంది. సరిగా కంఠంమొదటికి విరగగొట్టబడ్డ యీశిల్పఖండాన్ని ఫొటోగ్రాఫు తీసిన వారు ఒక రాతి కట్టపైన పెట్టి ఫొటో తీశారు. అందువల్ల యీకట్ట శిరస్సుక్రిందవుండే భుజాలు విరుగ కొట్టడంవల్ల కన్పించే మొండెంవలె కనపడుతూంది. వాస్తవంగా యీశిల్పాన్ని చూడని వారు ఇది రోమనుల శిల్పంలో వుండే Bust వలె ఉన్న దని భ్రమిస్తారు ఈగ్రంథంలో వున్న చిత్రపటాలని గురించి ఇంకో మాట చెప్పవలసివుంది. ఇది ౬౨ పేజీ తర్వాత "పద్మాక్షిగుడిలోని మటి యొక స్త్రీవిగ్రహము" అనే చిత్రాన్ని గురించి. ఇది పురుషవిగ్రహం కాని స్త్రీవిగ్రహం కాదు. పద్మాక్షి గుడిలో ఎడమవైపున ఒక రాతిమీద ఒక జైనతీర్థంకరుడు అతని కడమవైపున ఒక స్త్రీ విగ్రహం, కుడి వైపున ఒకపురుషవిగ్రహం చెక్క

బడి ఉన్నాయి. ఈరెండున్నూ ఈతీర్థంకరుడి యక్షిణీయక్షులవి. పరిష్కర్తగారు పైయక్షుడి విగ్రహాన్ని శ్రీమూర్తి అని పొరబాటుగా పేర్కొన్నారు. ఈగ్రంథంలో ముఖ్యంగా వుండతగినది వేయిస్తంభాల గుడి శాసనపు ప్రతిబింబం. ఎన్నో యితరచిత్రాలను యీగ్రంథంలో చేర్చిన పరిష్కర్తగారు యీవిషయాన్ని గమనించి వుండవలసినది. డాక్టరు ఫ్లీటుయొక్క ఇతర పండితులయొక్క పాఠాలను సవరింపబూనుకున్న పరిష్కర్తగారు శాసనప్రతిబింబాలను కూడా ప్రకటించివుండవలసింది. అప్పుడు కాని వారి స్వతంత్రపాఠాలను విమర్శించడానికి వీలు కాదు.

తప్పుపేర్లు:—ఈగ్రంథంలో కొన్ని ముఖ్యమైన పేర్లు అనేకస్థలాల్లో తప్పుగా వున్నాయి. ౧ ఇండియన్ ఆంటిక్వారియన్ Indian Antiquarian, (చూ. పే. IX, ౩, ౧౧.౧౬), ౨ Deccan History by Dr. R. Bhandarkar (పే. ౨౫), ౩ List of Antiquaries, (పే. ౩౫), ౪ బిజ్జన (పే. ౨౫, ౫౯) ౫ కదలాలయ (పే. ౨౬, ౫౦) ౬ హాల్జు ప్రభువు (పే. ౩౧) ౭ డొమ్మరాజు (పే. ౩౫). మొదలగునవి ఇందుకు కొన్ని నిదర్శనాలు.

అనుబంధము:—పరిష్కర్తగారు అనుబంధములో నాలుగు శాసనాలు ప్రకటించారు. అందులోని రెండు మూడు నంబర్లు గలవాటికీ వేయి స్తంభాల గుడి శాసనానికీ ప్రత్యక్షసంబంధం లేదు. నాల్గో శాసనం చాలా ముఖ్యమయినదే కాని దానిలో తప్పులు చాలా వున్నాయి. మూడో శ్లోకంలో నాల్గో పాదంగా వ్రాయబడినది మొదటి పాదం. నాలుగో శ్లోకం పరిష్కర్తగారివలె విభజిస్తే ఛందోభంగం కలుగుతూంది. ఈశ్లోకాలను వారు నేను చదవగా వ్రాసికొన్నామని నారు. నావద్దనున్నది నేను వారికి చూపించినది అయిన ప్రతిలో యీతప్పులేమీ లేవు. ముద్రణకు పంపేటప్పుడైనా పరిష్కర్తగారు వీనిని సవరించుకొని వుంటే బాగుండేది. ముఖ్యంగా అనుబంధంలో చేర్చవలసిన కొన్ని శాసనా లున్నాయి. వాటివల్లనే మనకు వేయి స్తంభాల గుడి శాసనంలో చెప్పబడ్డ స్థలాలనూ కాకతీయప్రత్యర్థులనూ నిర్ణయించడానికి వీలవుతుంది. నైజాంరాష్ట్రములోని జటచర్ల నెక్కొండ నగునూరు మొద లయిన గ్రామాలలోని శాసనా లిట్లాంటివి. ఇవన్నీ కూడా సుజాత పత్రికలో ప్రకటించబడి వున్నాయి. సుప్రసిద్ధచారిత్రికపరిశోధకులు లయిన శ్రీశేషాద్రి రమణకవులు భారతి ౭ సంపుట ౬ సంచికలో వీటిని గురించి ఒక చక్కని వ్యాసం వ్రాశారు నేను కూడా నా 'కాకతీయుల చరిత్ర'లో వీటిని ఉదహరించాను. పరిష్కర్తగారు వీటి నన్నిటినీ చూచే వున్నారని వారి గ్రంథం తెలుపుతూంది. అయినప్పటికీ వారు యీశాసనాలను అనుబంధంలో చేర్చకపోవడం వింతగా వుంది.

చారిత్రికవిషయాలు:—ఫ్లీటు, కృష్ణశాస్త్రి రామయ్యపంతులు, వీరభద్రరావు సోమశేఖరశర్మ గార్లున్నూ, ఇటీవల శేషాద్రిరమణకవులున్నూ నేనున్నూ చర్చించిన చారిత్రికవిషయా లనేకాలు యీగ్రంథంలో వున్నాయి. సందర్భాంతరాలలో వ్రాయబడ్డ అభిప్రాయాలనూ సమన్వయాలనూ ఒకచోట కేంద్రీకరించి పరిష్కర్తగారు వాటికో నూతనత్వాన్ని ఇచ్చారు. వీరి అభిప్రాయాలు చాలావరకు నేను నా కాకతీయులచరిత్రము లో వెలిబుచ్చిన అభిప్రాయాలతో సరిపోతున్నాయి. అయినా మరికొన్ని సందర్భాలలో పరిష్కర్తగారి ఊహలు విమర్శార్హాలుగా వున్నాయి. వాని నీక్రింద వివరిస్తున్నాను.

౧ ఇండియన్ ఆంటిక్వారి. Indian Antiquary, ౨ Early History of the Deccan by R. G Bhandarkar, ౩ List of Antiquities, ౪ బిజ్జలుడు. ౫ కడలాలయ. ౬ హూల్షు పండితుడు, ౭ దొమ్మరాజు.

(౧) "ఈశాసనమునందలి తెనుగు గద్యను బట్టి అచింతేంద్రవరు డుభయభాషాప్రవీణు డని మనము విశ్వసింపవచ్చును. ఈయన వ్రాసిన తెనుగు వచనం సలక్షణ మైన జాతీయభాషలో నున్నందున.." అని వ్రాశారు పరిష్కర్తగారు. (చూ. పే ౧౯, ౨౦) ఈ ఊహాకి వారు చూపిన కారణం చాల దు. పై తెనుగు గద్య మన దస్తావేజుల మతలబుల వలె ప్రతిశాసనంలోను, మొదటనో, చివరనో వుండేదే. దీనిని వ్రాయడం కేవలం ఒక లాంఛనం. దీన్నిబట్టి కవియొక్క భాషాజ్ఞానం గాని, కవితా నైపుణ్యం గాని ఎంతమాత్రం తెలియవు. అట్లయితే శాసనరచయిత లందరూ కూడా భాషావేత్త లనిన్ని మన దస్తావేజాలు మొదలయినవి వ్రాసేవా రంతా ఆంధ్రపండితు లని చెప్పవలసి వస్తుంది.

(౨) వేయిస్తంభాల గుడి శాసనంలో రెండవ బేతరాజు "న్యగ్భూతీకృతనాయకః" అని వర్ణింప బడ్డాడు (శ్లో. ౬) పాశ్చాత్యచాళుక్యచక్రవర్తి ఆరవ విక్రమాదిత్యుడి యొక్క 'త్రిభువనమల్ల' అనే బిరుదు రెండవ బేతరాజు క్కూడా వుంది ఈరెండు విషయాలనూ పురస్కరించుకొని పరిష్కర్తగారు న్యగ్భూతీకృతనాయకః=తిరస్కరింప బడిన ప్రభువు అని అర్థం చెప్పి ఆప్రభువు ఆరో విక్రమాదిత్యు డని సమన్వయించారు. "అట్లగుట చేతనే యతని బిరుదము ను బేతరాజు ధరించినా" డని వారి ఊహ. ఈఅర్థమూ, ఊహా కూడా చరిత్రకి విరుద్ధంగా వున్నాయి. బేతరాజు విక్రమాదిత్యుడికి సామంతు డని ఆశ్రితు డని "తత్పాదపద్మోపజీవి, పతిహితచరిత" మొదలయిన హనుమకొండకన్నడశాసనంలో యితని బిరుదులున్నూ, ఇతని మంత్రి ఇతనిచేత విక్రమాదిత్యుడి పాదాలకు మొక్కించా డనే విషయమూ స్పష్టపరుస్తున్నాయి. అంతే కాకుండా ఒక వ్యక్తి ఇంకొకడి బిరుదులు తాను ధరించా డంటే అతని యెడల తన కుండే భక్తిగౌరవాల్ని సూచించడమే ఉద్దేశ్యం. అనేక మంది సామంతులు తమ యేలికల బిరుదుల్ని యిలా ధరించారు. (ఉ. పల్లవరాజైన మొదటి మహేంద్ర వర్మకుండే "మదనవిలాస, మార్గవచిత్రా"ది బిరుదులు రేనాటిరాజయిన పుణ్యకుమారుడు ధరించాడు.) పశ్చిమచాళుక్యరాజుల బిరుదు లైన "త్రిభువనమల్ల, త్రైలోక్యమల్ల" మొదలయిన బిరుదులు ఆంధ్రచోడసామంతు లెందరికో ఉండేవి. ఒక రాజును ధిక్కరించి ఇంకొక రాజు వహించే బిరుదులింకో విధంగా వుంటాయి (ఉ. కంపిలయువరాజైన కుమారరాముడు కాకతీయప్రతాపరుద్రుణ్ణి ధిక్కరించి "వీరరుద్రవగండ" అనే బిరుదు ధరించాడు) కనుక రెండో (కాకతీయ) బేతరాజు విక్రమాదిత్యుణ్ణి తిరస్కరించా డనే పరిష్కర్తగారి ఊహ సరియైనది కాదని తోస్తూంది.

(౩) అనుబంధంలో వారు ప్రకటించింది కాక ఖాజీపేటలో దొరికిన మరి రెండు శాసనాలని గురించి ప్రశంసిస్తూ పరిష్కర్తగారు ఇవి రెండూ ఒకటే శాసన మని, అది రెండవ బేతరాజు దని ఊహించారు. (చూ. పే. ౨౦, ff ౨౪). ఇది సరి కాదు ఇందొకదాంట్లో విక్రమాదిత్యుడి సామంతుడైన బేతరాజూ, అతని తండ్రి ప్రోలరస పేర్కొబడ్డారు. ఈబేతరాజు రెండో బేతరాజే. రెండో శాసనం దుర్జయవంశీకు డైన బేతరాజుని, అతని కొడుకు ప్రోలరాజుని పేర్కొని యీప్రోలరాజు ప్రతాపాన్ని వర్ణిస్తుంది. ఇది రెండవ ప్రోలరాజు నాటిది. ఈవిధంగా ప్రత్యేకంగా వున్న యీరెండు శాసనాలూ ఒకటే అనటానికి ప్రమాణం ఏమీ లేదు.

(౪) రెండో ప్రోలరాజు రాజ్యాంత్యసంవత్సరాన్ని గురించి పరిష్కర్తగారొక కొత్త సిద్ధాంతం చేశారు. ఈకాలం క్రీ. శ. ౧౧౫౮ అయుంటుం దని నే నిదివరలో వ్రాశాను. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు క్రీ. శ. ౧౧౪౦ అని ఊహించారు. పరిష్కర్తగా రీరెండు తేదీలనూ త్రోసి

పుచ్చి ప్రోలరాజు క్రీ. శ. ౧౧౪౮ లో మరణించా డని వ్రాశారు. (చూ. పే. ౨౫-౨౬, ౩౪-౩౫) వీరికి ప్రమాణం రాజరాజు ౨ (౩) వ సంవత్సరంలో కాకతిరుద్రుడి భార్య చేసిన ధర్మాన్ని తెలిపే ద్రాక్షారామశాసనం దీన్ని శ్రీసోమశేఖరశర్మగారు ఉదహరిస్తూ ద్రాక్షారామంలోనే రుద్రదేవుడి మంత్రిది రాజరాజు ౧౩ వ సంవత్సరంనాటిది మరొక శాసనం కూడా వుం దని వ్రాశారు. ఈరాజరాజు ౧౩ వ రాజ్యసంవత్సరం. క్రీ. శ. ౧౧౫౮ కి సరి అవుతుం దని పరిష్కర్తగారే అంగీకరించారు. దాన్ని బట్టి వారు ప్రమాణంగా గ్రహించిన రాజరాజు ౨౩ వ సంవత్సరపు శాసనం క్రీ. శ. ౧౧౬౮ అవుతుంది. కాని పరిష్కర్తగా రనుకొన్నట్లు క్రీ. శ. ౧౧౪౮ కానేరదు. కళింగకంచిక (పే. ౧౭౮) లో శ్రీశర్మగారు వ్రాసిన దానిని పరిష్కర్తగారు సరిగా అర్థం చేసుకోలేదు. గ్రంథంలో ఇల్లా వ్రాసి వారు శుద్ధపత్రంలో యీభాగం ఎక్కడ వచ్చినా వదలివెయ్యా లన్నారు. దీనికి కారణ మేమో తెలియదు. ఇట్లాంటి వ్రాతలు పాఠకులని పెడదారి తొక్కిస్తాయి.

(౫) కాకతిరుద్రుడి అంత్యసంవత్సరాన్ని గురించి కూడా పరిష్కర్తగారు నూతనసిద్ధాంతం ఒకటి చేశారు. పిల్లలమర్రి గ్రామంలో శాసనం ఒకటి ఆధారంగా కాకతిరుద్రుడు క్రీ. శ. ౧౧౯౫ లో మరణించి వుంటా డని నేను వ్రాశాను. కాని పరిష్కర్తగారు Sewell పండితుడు List of Antiquities లో కుంకలగుంటగ్రామంలో క్రీ.శ. ౧౧౯౭ నాటి శాసనం ఒకటి కల దన్నా డనీ, ఈశాసనసంవత్సరమే రుద్రుడి అంత్యసంవత్సర మనీ వ్రాశారు. కాని ఈశాసనం విశ్వసనీయం కాదు. Sewell గారే యిది చాలా అరిగిపోయిం దనీ, జాగ్రతగా పరిశీలింపతగిం దనీ, ఇందులో ప్రతాపరుద్రుడి పేరు కనపడుతూం దనీ, దీనికాలం శా. శ. ౧౧౧౯ (క్రీ. శ. ౧౧౬౭) కావచ్చు ననీ వ్రాశారు. Dr. Burnell గారు దీని కాలం క్రీ శ. ౧౨౨౮ అన్నారు. ప్రతాపరుద్రుడి పేరిందులో వుంటే Sewell గా రిచ్చిన కాలం తప్పు. వా రిచ్చిన కాలం సరి అయితే ప్రతాపరుద్రు డాకాలంలో ఉండటం అసంభవం. వివాదాస్పద మయిన యీశాసనంమీద ఆధారపడిన పరిష్కర్తగారి సిద్ధాంతం సమంజసం కాదు.

(౬) పరిష్కర్తగారు తమ పీఠిక II వ పుటలో "స్వయముగా యతియునై...శ్రీమత్కాకతి రుద్రదేవునికి బరమగురు వగుటవలన గూడ మన కీయన కావలసిన వాఁడు" అని వేయిస్తంభాల గుడి శాసనాన్ని రచించిన అచింతేంద్రవర్యుణ్ణి గూర్చి వ్రాసారు. ఈకవి కాకతిరుద్రుడికి గురు వని చెప్పడానికి ప్రమాణ మేమీ లేదు

(౭) హనుమకొండ కన్నడ శాసనంలో చెప్పబడ్డ 'కడలాలయ' ఇప్పటి పద్మాక్షి కా దనీ, కడలాలయ లేక పద్మావతికి ఉండవలసిన లక్షణాలు పద్మాక్షిగుండం దగ్గర దొరకిన ఒక భిన్నవిగ్రహానికి వున్నా యనీ, ఇప్పటి పద్మాక్షి ఆమె గుడిలో చెక్కబడి వున్న జైనతీర్థంకరుడి శాసనదేవి అనిన్నీ, కాకతీయోత్సవ సందర్భంలో నేనున్నూ, డాక్టరు నారాయణరావుగారున్నూ అభిప్రాయపడినాము. అంతే కాని పరిష్కర్తగారు వ్రాసినట్లు (చూ. పే. ౫౧) "ఇప్పుడు పద్మాక్షి గుడిలో గలది జైనవిగ్రహము గా దనియు, దానిని తీసి గౌరిదేవి బొమ్మ నచ్చట యుంచి యుందురనియు" మేము చెప్పలేదు. మాఅభిప్రాయాలు హిందూ, ఆంధ్రపత్రికలలో ప్రకటించబడ్డాయి. వాటిని పరిష్కర్తగారు చూడలేదేమో.

వేయిస్తంభాలగుడి శాసనానికి సంబంధించిన యీ గ్రంథాన్ని గురించి ఇంకొక మాట చెప్పవలసి వుంది. ఈశాసనం లోని వ్యక్తులను నిరూపించడానికి నైజాంరాష్ట్రంలోని శాసనాలే ముఖ్యాధారం. ఈశాసనాల్ని బయల్పడలించిన వారు

శ్రీ శేషాద్రిరమణకవులు. వారు ప్రకటించిన వ్యాఖ్యానాలే పండితుల్ని ఈశాసనాల వైపు ఆకర్షించాయి. 'అనుమకొండ శాసనము' అనే శీర్షికతో వారు భారతి ౭ సంపుటం ౬ సంచికలో ప్రకటించిన వ్యాసం వేయి స్తంభాల గుడి శాసనానికి తాళం వంటిది. పరిష్కర్తగారు పైవ్యాసాన్ని, సుజాతపత్రికలో పడ్డ కవుల వ్యాఖ్యానాలనీ చూచినట్టు వారి గ్రంథమే తెలుపుతూంది. 'ఆట్లాంటప్పుడు ఈగ్రంథంలో ఒక చోటనైనా నైజాం రాష్ట్రంలో చరిత్రపరిశోధనకి మార్గదర్శకులుగా వున్న శ్రీశేషాద్రిరమణకవుల ప్రశంశ చేయబడక పోడం చాలా వింతగా వుంది.

మొత్తంమీద ఈ గ్రంథం చాలా అమూల్యమయినది. పరిష్కర్తగారు మిక్కిలి కృషిచేసి వ్రాసిన శాసనశ్లోకాల అర్థాన్ని, చారిత్రికాది విషయాలు గల వారి వ్యాఖ్యానాన్ని చదివిన ప్రతి వారికీ కాకతీయుల చరిత్రయందే గాక చరిత్ర పరిశోధనయందు కూడా ప్రబల మైన అభిరుచి కలగగలదు ఈగ్రంథంలో అనేకమంది పండితులు అనేకసందర్భాల్లో వ్రాసిన అమూల్యవిషయా లన్ని క్రోడీకరించబడ్డాయి. శైలి మనోహరంగా వుంది. ప్రకృతశాసనంవలెనే ఆంధ్రదేశపు చరిత్రకి మూల స్తంభా లైన శాసనాలు చాలా వున్నాయి. వాటిని గురించి కూడా ఈవిధంగా ప్రత్యేక గ్రంథాలు రచించడం ముఖ్యావసరం. విద్వాన్ శ్రీ అప్పన్న శాస్త్రిగారీవిషయంలో మార్గదర్శకులయారు. వీరు ఇంకా చక్కని కృషి చేసి, చారిత్రికసామగ్రికి ఖని యైన నైజాంరాష్ట్రంలో వుండే యితర శాసనాది సామగ్రిని బయల్పరచి దేశానికి అమూల్య మైన సేవ చేస్తారుగాక. ఆంధ్రులు వీరి గ్రంథాన్ని, ఉద్యమాన్ని ఆదరించి ప్రోత్సాం ఇస్తారని నేను విశ్వసిస్తున్నాను. *

మారేమండ రామారావు

హిందీవల్ల తెనుక్కి జరుగుతూ వున్న అపకారం

ఈశీర్షికతో జూలై సంచికలో కొన్ని లేఖలు ప్రకటించి వున్నాము. ఇప్పు డివి ప్రకటిస్తున్నాము. ఇంకా మిగిలి వున్నవీ, వచ్చేవీ వరసగా ప్రకటిస్తాము. అయితే హిందీయొక్క దురాక్రమణాన్ని గురించినవారు మనలో చాలా తక్కువగా వున్నారు, కొందరికి ఈవిషయం యింత దూరం వెళ్ళిందా అని అనుమానం కూడా వుంది జూలై సంచికలో ప్రకటించబడ్డ లేఖలూ వ్యాసమూ చూసీ గూడా కొందరు "అవునా? " అని తొక్కిళ్ళాడుతున్నారు. సామాన్యభాషగా అంగీకరించబడ్డ హిందీ మన తెనుగు దేశంలో తన స్థానం విడిచిపెట్టి తెనుగు స్థానం ఆక్రమించుకొంటోంది. మేము చేసే ఆక్షేపణ యిదీ. ఇందులోనూ, ♦ వెనకటి సంచికలోనూ చూపించబడ్డ వుదాహరణాలు ఈసంగతి రుజువుచెయ్యగలవు.

---

* ఇది ౯ × ౧౧౯ × ౧౬ పేజీల గ్రంథం. క్రౌన్ సైజు. గ్లేజు కాగితాలు. చక్కని అచ్చు, బైండింగూనూ. ఆర్టుకాగితంమీద ముద్రించబడ్డ చిత్రపటాలు ౧౫ దేశపటాలు ౩ ఉన్నవి. వెల ౨-౦-౦. కలయువారు కలాభివర్ధనీ పరిషత్తు—రాజమహేంద్రవరం అని రాయాలి.

♦ "పాలకొల్లు జూలై ౭:—పశ్చిమగోదావరీమండల మందలి సుప్రసిద్ధహిందీప్రచారకులు ఈపుర మందలి శ్రీయుత అద్దేపల్లి గంగరాజుగారి సత్రమున దక్షిణభారతహిందీప్రచారసభాఆంధ్రశాఖాసంచాలకు లైన శ్రీ పీసపాటి వెంకటసుబ్బారావుగారి యధ్యక్షతను సమావేశ మైరి......అపిమ్మట అధ్యక్షులు

ఏకవచన మంటేనూ, బహువచన మంటేనూ యేమిటో తెలవని తెనుగుయువయువతులకు హిందీప్రచారకులు హిందీని నూరిపోస్తున్నారు ఇది తప్పు కాదా అంటే హిందీవ్యాకరణంద్వారా తెనుగువ్యాకరణం గూడా మేము చెప్పడం లేదా అంటున్నారు. అయితే తెనుగువాళ్ళు హిందీద్వారా తెనుగువ్యాకరణం నేర్చుకోవలసిందేనా? ఇది స్రక్రమపద్ధతేనా? ఏకవచనబహువచనాలెరగని తెనుగుమనిషికి సామాన్యభాషయొక్క అవసరం యెప్పుడేనా కలుగుతుందా? పైగా హిందీ నేర్పేటప్పుడు ప్రచారకులు తెనుగులో వాడబడే అనేకసంస్కృతపదాలకు అర్థం చెబుతున్నారుట. తెనుగులో సంస్కృతపదాలు వాడేవారు వాటి అర్థం—అథవా భావం తెలవకుండానే వాడుతున్నారా? కాకపోయినా హిందీప్రచారకులు "అగ్రహాం" "ప్రబంధకర్" మొదలైన పదాలకు ఏం అర్థం చెబుతారూ? హిందీ నేర్చుకున్నాకే అనేకమంది తెనుగువారు భారతభాగవతాలు చదువుతున్నారంటే అది సంతోషించతగ్గదా సిగ్గుపడతగ్గదా? ఆంధ్రసాహిత్యమూ ఆంధ్రజాతీయమూ హిందీద్వారా ప్రపంచకాని కంతటికీ వ్యాపింపచెయ్యవచ్చునంటే హిందీకి యెప్పటికేనా అంత యోగ్యత కలుగుతుందా? అసలు ఆంధ్రసాహిత్యమూ, ఆంధ్రజాతీయతా ఆంధ్రులకేనా యిదివరకు బాగా కాకపోతే మానే కొంతవరకేనా తెలిసిందా? తులసీదాసు తెనుగునందలి అజంతశబ్దాల మాధుర్యం చూసే తన రామాయణంలో అజంతశబ్దాలను వాడేడన్న సంగతి సుబ్బారావుగారు హిందూస్థానీలకు చెబితే బాగుంటుంది, కాని మనకి కాదు. అయితే వొకవిశేషం కూడా వుంది సుబ్బారావుగారు హిందీ తెనుగంత మధురమైనది కాదని చెబుతున్నారు సంతోషమే అయితే యిక తాము హిందీ అంటే అంత ఉక్కిరిబిక్కిరి కావడం యెందుకూ? హిందీ మనకి

ఈక్రింది విధముగ నుపన్యసించిరి. "......హిందీ తెనుగుభాషను నశింపజేయుచున్నదను ప్రబుద్ధాంధ్ర పత్రిక వారి వ్రాతలు చూచిన నాకు ఆశ్చర్యము కలుగుచున్నది. హిందీప్రచారమువలన ఆంధ్రభాష వృద్ధి పొందుచున్నది. ఏకవచనము, బహువచనము అన నేమో తెలియని వారలకు హిందీ చదువుచున్నప్పుడది యేమో చెప్పి ఆంధ్రవ్యాకరణము సహితము హిందీప్రచారకులు ప్రచారము చేయుచున్నారు. తెనుగులో వాడబడు అనేకసంస్కృతశబ్దముల కర్థము హిందీభాష నేర్చుకొని చాలమంది విద్యార్థులు తెలుసుకొనగలుగుచున్నారు. హిందీ నేర్చుకొన్నందువలన కొంతమంది సాహిత్యాభిరుచి కలిగి ఆంధ్రమునందును భారతభాగవతములు చదువువారల నే నెరుంగుదును. ఆంధ్రసాహిత్యమును ఆంధ్రజాతీయమును హిందీభాషద్వారా మనము చాల సులభముగా భారతదేశమునకే గాక ప్రపంచమున కంతటికిని తెలియజేయుటకు వీలుండును. ఆంధ్రభాష పరిపూర్ణమైనది మృదువైనది. ఇందలి అజంతశబ్దముల మాధుర్యమును గ్రహించియే తులసీదాసు తన రామాయణమునందు విరివిగా అజంతశబ్దములనే ప్రయోగించెను.... హిందీప్రచారకు లగు మీరలు ఆంధ్రదేశమునందలి ప్రతివారికిని హిందీ నేర్పి భారతీయులుగా తయారు చేయుడు. మీ రందరు హిందీభాషాప్రచారము ద్వారా భారతదేశకల్యాణమునకు తోడ్పడుడు. (ఈసమావేశంలో నిశ్చయించబడ్డ కొన్ని తీర్మానాలు) ౩ ఈమండల మందలి సభ్యులు జిల్లాయందంతటను విరిగా హిందీప్రేమీమండలులు, వాగ్వర్ధనీసభలు స్థాపించి హిందీనాటకముల ద్వారా కూడ హిందీప్రచారము చేయవలెను. ౪ వ్యాపారులు, రైల్వే అధికారులు, ప్లీడరులు మున్నగువారు తమతమ ప్రకటన బల్లలమీద తెలుగుతోబాటు దేవనాగరిలిపిని గూడ వాడవలయును. ౬ ఈజిల్లాలో రాష్ట్రభాషావిశారద కొరకొక మహావిద్యాలయము స్థాపించబడవలయును"

౧౧–౭–౧౯౩౮, ఆంధ్రపత్రిక అయిదోపేజీ, నాలుగో కాలం.

సామాన్యభాష అంటే అది అవసర మైనవారు అదియేలాంటి దైనా నేర్చుకుంటారు. అలాంటప్పుడు వారి మతబోధ చెయ్యడమూ, తెనుగువారి తెనుగుతనాన్ని చంపడమూ యెందుకూ? హిందీప్రచారకులు ఆంధ్రులను హిందీ నేర్పి భారతీయులుగా తయారుచెయ్యాలిట. అయితే మనం యిదివరకు భారతీయులం కామా? పశ్చిమగోదావరీమండలహిందీప్రచారకులు జిల్లా అంతటా హిందీప్రేమీమండలులూ, వాగ్వర్ధనీ సభలూ యేర్పరచాలిట. హిందీనాటకాలు కూడా ఆడాలి–ఆడించాలిట. అయితే తెనుగుదేశంలో తెనుగుకంటేనూ హిందీకి ఎక్కువ ప్రచారం కావా లనడం ఆత్మగౌరవంలో చేరుతుందా? ప్లీడర్లూ, వర్తకులూ మొద లయినవారు తమ ప్రకటనబల్లలమీద దేవనాగరిలిపి కూడా వాడాలిట. ఎందుకో? "మేము హిందీదాసులం" అని చెప్పుకోడానికా? లేకపోతే హిందూస్థానీలు వీధిలో వెళ్ళేటప్పుడు తమ ప్రతాపంయొక్క ప్రగమనశీలతను సులభంగా తెలుసుకోడానికా? పశ్చిమగోదావరిజిల్లాలో హిందీప్రచారాని కొక మహావిద్యాలయం స్థాపించాలిట. తెనుగుదేశం మొత్తంమీదేనా తెనుగూ, దాని కవసర మైన సంస్కృతమూ నేర్పడాని కొక మహావిద్యాలయం లేదు. అలాంటి దేశంలో హిందీ నేర్పడానికి జిల్లా కొక మహావిద్యాలయమా? ఇంతవరకూ యింగ్లీషువిద్యాలయాలతోటే తెనుగు కొంపలు గుల్లై పోతున్నాయి. తెనుగు భాష వెనకపడుతోంది. తెనుగుకవులు, తెనుగు గ్రంథకర్తలు కూలబడిపోతున్నారు. తెనుగుపత్రికలు గుంటపువ్వులు పూస్తున్నాయి తెనుగుజాతి వొకోవిధంగా ఆత్మగౌరవానికి దూర మవుతోంది. ఈస్థితిలో హిందీమహావిద్యాలయాలు కూడానా?

సంపాదకుడు

౧

జూను సంచిక "ప్రబుద్ధాంధ్ర"లో సంపాదకులు "హిందీభాషవల్ల తెలుక్కి జరుగుతున్న అపకారం" గురించి పేజీ మించని అభిప్రాయాలు కోరుతూ హిందీప్రచారకులను హద్దులో ఉంచటమే తమ అభిప్రాయ మని చెబితే హిందీభాషవల్ల తెలుక్కి జరుగుతూన్న అపకార మేమిటో నాకు తెలీకపోయినా, తెలుగువాళ్లు దేన్లో జొరబడ్డా వేలంవెర్రే నని తెలుసు కాబట్టి హిందీప్రచారంలో అంత వేలంవెర్రి అవసరం లేదని ఉద్బోధిస్తా రేమో కదా అనుకున్నాను. కాని జులై సంచిక చూచిన మీదట వ్యవహారం చాలా ముదిరినట్టు కనిపిస్తున్నది. జేకుపల్లి కామేశ్వరరావుగారు అనేకపేజీలు రాయటమే కాకుండా హిందీఉద్యమానికి ప్రతిఉద్యమం ఒకటి బయల్దేరదియ్యా లని కూడా స్పష్టంగా చెబుతున్నారు. వారి అభిప్రాయం కేవలం హిందీప్రచారకులను హద్దులో ఉంచటంగా కనపడదు.

అభిప్రాయాలు వెలిబుచ్చినవారు ఈక్రిందివిషయాలను గురించి పొరపాటు పడ్డా రని నాకు తోచింది.

(౧) హిందీభాష తెలుక్కి ఏ మపకారం చెయ్యగలదు?

ఏమీ అపకారం చెయ్యలేదు. మనకు సంబంధించినంత వరకు హిందీ చచ్చిన భాషతో సమానం. దానికి మనం జీవం ఇవ్వలేం. అది మన మాతృభాష కాదు. ఇంగ్లీషయినా అంతే. ఈరెండు భాషలూ చెయ్య లేని అపకారం చచ్చి శిథిల మైన గ్రాంథిక భాష తాలూకు జీవం లేని ఎముకలు బతికున్న తెలుగుకు చేస్తున్నై. సజీవ మైన మాతృభాషను తొక్కిపట్టే టందుకు బంధుకోటిలో చేరిన సంస్కృతం, గ్రాంథికభాష లైతే నేం. ఇరుగు పొరుగు హిందీ ఇంగ్లీషు భాష లైతే నేం? గ్రాంథికభాష మన తెలుగుమీద పెట్టిన మోపు హిందీ కాని ఇంగ్లీషు కాని ఎన్నడూ పెట్టలేరు. అయితే ఈభాషలను చూస్తే వ్యామోహ మెందుకు? ఎవరికీ సజీవంగా

ఉండని గ్రాంధికఆంధ్రమే మనవాళ్ల నింత వ్యామోహపెడుతూంటే, ఒకరి కైనా సజీవంగా ఉన్న హిందీ ఇంగ్లీషులను చూస్తే వ్యామోహం ఎందుకుండదు? స్వదేశవస్తువు లంతా కొనా లంటే దేశభక్తి అనటం కన్న మంచి తర్కం ఏమి టంటే స్వదేశవస్తువులు విదేశవస్తువులతో సమాన మైనవిగా చెయ్యటమే. అంతవరకూ కొంత శ్రమ తప్పదు. ఇప్పు డిప్పుడే సజీవ మైన తెలుగుకు బంధవిముక్తి కలుగుతున్నది. నలుగురు పెద్దలూ చేరి దాని అస్పృశ్యత తొలిగించారు తన భాషలో భావాన్ని చక్కగా ప్రకటించగలవాడు తనది కాని ఇతర భాషకు పోతాడని ఎన్నడూ తలచవద్దు పొరుగింటి పుల్లకూర అనవటమే కాని, ఎప్పుడూ రుచి కాదు. అనేకవందలమంది కాశీహిందూవిశ్వవిద్యాలయానికి పోయి హిందీ అక్షరాలు కూడా తెలుసుకోకుండా ప్రతిసంవత్సరం కొంప చేరుకుంటున్నారు.

(౨) మనకు హిందీ ఎంతవరకు ఆవశ్యకం?

హిందీభాష నేర్చుకోవటం, రాయకలగటం, మాట్లాడకలగటం — అరవలు తెలుగు మాట్లాడినట్టుగా నైనా సరే — చాలా అవసరం — మనకే కాదు — ప్రతి హిందువుడికీ! భాషాబాంధవ్యం ఎంతదూరం వెళుతుందో అందరం గమనించాలి. ఒక్క భాష నాగరికతను, మతాన్ని, ఆచారాలను అద్భుతంగా కలుపుతుంది. రాజకీయంగా హిందూదేశం యావత్తూ ఒక్క మెట్టుమీద నిలబడాలిసిన రోజు వచ్చింది. ఈరోజున ఎవరి భాషకోసం వాళ్లు పోట్లాడి దేశంలో ఎన్నిభాష లున్నవో అన్ని పెళ్లలుగా దేశాన్ని విరగదియ్యటం ఘోర మైన పని. అంతా ఒకటే కుటుంబం. ఇందులో పిన్నలకూ పెద్దలకూ ఒక భాష కాక మధ్య దుబాసి లచ్చిన్న లెందుకు? కాశీనాధుని నాగేశ్వరరావుపంతులుగారు దేశ మంతా ఒక్క హిందీభాష యితే సంతోషిస్తా ననటం నా కెంతో ముచ్చటగా ఉంది. అది చాలా గొప్ప ఆశయం. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అసమ్మతి చూపటాని కేకారణం కనపడదు. దేశమంతా ఒకటే భాష అయిన తరవాత అది హిందీ అయినా తెలుగైనా ఒకటే అప్పు డక్కడ మరో భాష ఉండదు. ఎవ రాగ్రహించటాని కైనా. దేశ మంతా ఒకటే భాష కావటానికి తెలుగుకు కన్న హిందీ కెక్కువ అవకాశం ఉంది కాని మ రేమీ లేదు. అయితే అటువంటిది సంభవమా అంటే కాదు. మంచి ఆశయ మైనా కాదా అంటే కాదనటాని కెవరికి ఎట్లా నోరు వస్తుంది? దేశ మంతా ఒక భాష కావటంవల్ల ప్రయోజనము చాలా వందల సంవత్సరాల క్రితం రోముదేశమే ఎరుగును, ఇప్పు డింగ్లీషువారే ఎరుగుదురు!

అంతకన్న మనకు హిందీ భాషతో పని లేదు. నాకు కావలిసిం దెంతవర కంటే హిందూదేశంలో ఏమూలకు పోయినా నాహిందూసోదరులు మాట్లాడేది నే నర్థం చేసుకుని నేను నామాటలు వారికి తెలపగలగాలి. హిందూదేశంలో ఏమూలకు పోయినా "ఇది నాది!" అనిపించాలి. మన పూర్వులు హిమాలయపర్వతాలకూ కన్యాకుమారికి మధ్య ఉన్న ప్రతివస్తువూ తమ సొంతంగా భావించి అట్లా రాయగలిగారు. నేను మొదటిసారి కాశీ విశ్వేశ్వరుడి గుడి ప్రవేశించి "ఇది నాది!" అనుకోవా లని ప్రయత్నం చేసి ఓడాను.

హిందీ సారస్వతంతో నాకు పని లేదు. ఏ తెలుగువాణ్ణి కూడా ఒక్క హిందీపుస్తకం చదవ మని చెప్పను, హిందీలో పుస్తకాలు రాయ మని చెప్పను, హిందీ పత్రికలు సారస్వతాభివృద్ధికి నడప మని చెప్పను. *

* కుటుంబరావుగా రిలా చెబుతున్నారు, కాని హిందీప్రచారకు లెం చస్తున్నారో వారికి తెలవడం లేదు. ఇది చూస్తే తెలుస్తుంది. "భీమవరం, జూలై ౨:—......శ్రీరామకృష్ణ హిందీపాఠశాల తరపున కోలమూరు ఉప్పులూరు గ్రామములయందు రెండు హిందీప్రేమీసంఘములను స్థాపించిరి. ప్రతిఆది

హిందీభాషకోసం ఏహిందువుడు కూడా ఒక్క సంవత్సరం కన్న ఎక్కువ కాలం వ్యయం చెయ్యటం వ్యర్థం. ఆఒక్క సంవత్సరం ఎంతమాత్రం వృథా కాదు

కామేశ్వర్రావుగారు కూడా భాషాసేవ అంటూ మాట్లాడటం చాలా విచారకరం. భాషచేత సేవ చేయించుకుంటాం. ఎన్ని భాషలు మాట్లాడగలిగితే అంత హాని అని కామేశ్వర్రావుగారి అభిప్రాయం కాదనుకుంటాను!

(౩) హిందీ, తెలుగు పత్రికలు

తెలుగులో మంచి పత్రిక లింకా ప్రారంభం కాలేదనే చెప్పాలి. ఇంకా కొత్త. మన పత్రికలు అప్పుడే హిందీపత్రికలతో పోటీకి రాలేవు. పత్రికాసంపాదకులకూ వ్యాసరచయితలకూ జర్నలిజం అంటే ఏమిటో తెలీదు. మంచి ప్రింటింగు తెలీదు. పత్రికయొక్క బిజినెస్ సైడ్ తెలీదు. నలభై సంవత్సరాలనించి నడుస్తున్న పత్రికలతో మన పత్రికలు పోటీ ఏమిటి? తెలుగు రాతలో కొమ్ములు తిరిగిన వాడికి వెట్టివాడి వేతనం కూడా లభించటం లేదు. ధైర్యం చేసి వ్యాసరచన కెవడు జీవితం అర్పిస్తాడు? అట్లా కొంతమంది చొరబడక పోతే తెలుగు పత్రిక లెట్లా పైకొస్తై? తెలుగు దేశంలో భారతి సంచికల కన్న మాధురి సంచికలెక్కువ అమ్ముడుపోతున్న వనే అనకపోతే తెలుగుదేశంలో భారతి అమ్మినదాని కన్న మాధురి హిందీదేశంలో ఎక్కువ పర్సెంటేజి అమ్ముతున్నదని గమనించరాదూ? ఆలోపం భారతిలోనే ఉందనుకోరాదా?

హిందీపత్రికలు కనక హిందీప్రచారాన్ని దూషించాం. మైమాగజీన్ నలభైవే లమ్ముతున్నది దాన్లో పడే వ్యాసాలు చూడబోతే ఎట్లా ఉండాలో అట్లాగే ఉన్నై. దాదాపు అప్పక్కాగానే నడుస్తున్న వినోదినికి అంత అమ్మకం కనిపించదు. ఆ ఇంగ్లీషు పత్రిక కొనవద్దని కాని ఈ తెలుగు పత్రిక కొనవద్దని కాని ఎవరు టముటమా వెయ్యగలరు? తెలుగు పత్రిక కన్న ఇంగ్లీషు పత్రిక ఎక్కువనుందని తృప్తిపడుతున్నదని గ్రహించి ఊరుకోవలసిందే. నేనట్లే గమనిస్తున్నాను. ప్రబుద్ధాంధ్రను మూచూసేవాడు లేడు. తెలుగులో అటువంటి అమూల్యమైన వ్యాసా లిస్తూ, రాయల్ సైజులో, ఇంగ్లీషు బాడీలో ప్రింటుచేసిన ౪౮ పేజీలతో చక్కని ప్రింటింగుతో రూపాయి సంవత్సర చందాకు వచ్చే పత్రిక కన్న కారుచౌక ఏదో నాకు తెలీకుండా ఉంది. వేలకు వేలు అమ్మటం లేదంటే అది కావలిసినవాళ్లు చాలా కొద్దిమందే నన్నమాట! అమాటని ఊరుకోవటం కన్న చేసేదేముంది? హిందీప్రచారక్ అమ్ముతున్న దంటే భాష నేర్చుకోవాలని ఉన్న ప్రతివాడికి దాంతో పనుంది

(౪) అభిప్రాయాలు :

"ఈ హిందీ ఆరాటంతో తెనుగువారిలోని రవంత తెనుగుతనమున్నూ రాలిపోతున్నది," అని మానుమచ్ఛాస్త్రిగారి అభిప్రాయం. ఈ హిందీ ప్రచారం రాకమునుపు మనలో ఉండి ఇప్పుడు పోయిన తెనుగుతన మేమిటి? శాస్త్రిగారీవిషయం స్పష్టంగా చెప్పలేదు.

"ఒక భాష అభివృద్ధయిందంటే మరో భాష క్షీణించిందన్న మాటే" నన్నారు వామిత్రులు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు. ఒకరి కిద్దరు

వారము రోజున వాగ్వర్ధినీసభ జరుగుచున్నది. రాష్ట్రభాషావిశారద విద్యార్థులచే నొక హస్తలిఖిత హిందీ మాసపత్రిక వెలువడుచున్నది. పాఠశాల తరఫున హిందీగ్రంథాలయము గూడ స్థాపించబడినది. వానర, విశ్వమిత్ర, సరస్వతి, హిందీప్రచారక మొదలగు హిందీసాహిత్యక మాసపత్రికలను తెప్పించి బాలురచే చదివించుచున్నారు......పాఠశాలయందు విద్యార్థులచే హిందీనాటకములు గూడ ప్రదర్శింప మనవి చేయుచున్నారు" ౪—౭—౩౪ ఆంధ్రపత్రిక, రెండో పేజీ అయిదో కాలం.

హిందీ నేర్చుకోటం అభివృద్ధి కాదు. అసలాహిందీ ఏంతిని బతుకుతుందో మనకు తెలీదు ఇంగ్లీషు మన దేశంలో ఎంత అభివృద్ధయిందో హిందీ కూడా అంతే. (ఒక తెలుగు హిందీ పండితుడు హిందీలో రాసిన ఒకానొక ఉపోద్ఘాతం చూసి హిందీవాళ్లు నవ్వుతుండగా నేనక్కడ ఉండటం జరిగింది. ఆయనకు మంచి హిందీ రాదంటే అమాంతం మీదపడి కరుస్తారు!)

"చంద్రిక" కూడా హిందీప్రచారానికి అగ్రహించడం చూస్తే నాకు నవ్వాలో చింతించాలో తెలీటం లేదు. "చంద్రిక" భక్తితో పూజిస్తున్న తెలుగు ఎముకల కిక చలనం లేదే! ఏమైనా ప్రమాదం జరిగితే మేమంతా ప్రాణపదంగా పట్టుకొస్తున్న వాడుకభాష కుండాలి కాని. "చంద్రిక" వారి గ్రాంధికభాష మార్పుకూ చావుకూ అతీతమైపోయింది. లేక జీవభాష నెత్తిన మేం కాలు పెట్టి ఉండగా మధ్య ఈహిందీ ఎక్కణ్ణించొచ్చిందని అసూయా? మాకే రాయితే నేం తల పగలగొట్టుకోటానికి. గ్రాంధికభాష చెయ్యగలపని ఏమిటో తేలిపోయింది. ఒక్కసారి బయటికెళ్లి మళ్లీ లోపలికొచ్చి వీధిలో గమనించిందంతా రాయాలంటే కవిత్రయం, వారెక్కడా ఉపయోగించని మాటలు రెండు డజన్లు కావాలి. మాఆశ లన్నీ ఇంకా పసికూనగా ఉన్న వాడుకభాషమీద నే ఉన్నై కనక "చంద్రిక" హిందీని చూసి అట్టే ఆగ్రహిస్తే హాస్యాస్పదంగా ఉంటుందని మనవి చేస్తున్నాను.

కొడవటిగంటి కుటుంబరావు

(కుటుంబరావుగారి క్కూడా హిందీవ్యామోహం యింత ముమ్మరంగా వుంటుందని మే మెప్పుడూ అనుకోలేదు. అయితే వారి రాత మాత్రం తెనుగువారు తమ భాషని, వాఙ్మయాన్ని చక్కబరుచుకుని దాకా హిందీని ముట్టుకోగూడదనడానికి చాలా బలకరంగా వుంది. ఏమంటే తెనుగంటే మన కిప్పుడు నీరసం. తెనుగుమీద మనవారి కింకా ఉండవలసినంత అభిమానం కలగలేదు. ఈ సమయంలో మనం హిందీని నెత్తెక్కించుకుంటే తెనుగు వెనకబడిపోతుంది దీనికి కుటుంబరావుగారి భావాలే నిదర్శనం. అసల్లో మేము హిందీని సామాన్యభాషగా గ్రహించడం ఆక్షేపించలేదు. అయితే అది హద్దుమీరి వస్తోందన్నాము. అంతే. అందుకు వుదాహరణాలు చూపించాము కుటుంబరావుగారు వాటిని తాకలేదు......కుటుంబరావుగారు గ్రాంధికాంధ్రం మనకి అపకారం చేస్తోందన్నారు నిజమే కనకనే దేశం యిప్పుడు దానిమీద తిరగబడుతోంది. ఎక్కడో సాహిత్యపరిషత్పత్రికమాత్రమే దాల్లోపడి మునకలు పెడుతోంది. దానివల్ల మనకేమీ అపాయం లేదు. చంద్రిక కూడా కొంతవరకూ ఆదారే తొక్కుతోందంటే ఆకష్టనష్టాలు అదే అనుభవిస్తుంది చంద్రిక హిందీ ప్రచారానికి ఆగ్రహించడం తన సొంతానికి హాస్యాస్పదం కావచ్చు, గాని ఆంధ్రభాషకీ, ఆంధ్రవాఙ్మయానికీ, ఆంధ్రజాతికీ ఉపకారమే కాదూ!............"హిందీభాష నేర్చుకోవటం, రాయకలగటం, మాట్లాడకలగడం–అరవలు తెనుగు మాట్లాడినట్టుగా నైనా సరే–చాలా అవసరం–మనకే కాదు ప్రతిహిందువుడికీ" అన్నారు కుటుంబరావుగారు. సంతోషమే. అయితే ప్రచారకులు హిందీని తెనుగువారు వ్యావహారికంగా వాడుకోవాలని చెబుతున్నారు. అప్రచారోపన్యాసభాగాలు గత సంచికలో మేము చూపివున్నాము. కుటుంబరావుగారు దాని కేమీ మాట్లాడడం లేదు. ఏం? ..... కాశీనాధుని నాగేశ్వరరావుపంతులుగారు దేశం అంతా ఒక్క హిందీభాషయితే సంతోషిస్తాననటం కుటుంబరావుగారి కెంతో ముచ్చటగా వుందిట అది చాలా గొప్ప ఆశయముట. "అయితే అటువంటిది సంభవమా అంటే కాదు"ట. ఇం కెందుకూ ముచ్చట? కష్టమైనా సుఖమైనా అసలది ప్రాప్యమైతే యెంత ముచ్చటయినా చూపించవచ్చు. ఇప్పు డెందుకూ? పైగా "ఉప్పు లేకుం

డానే ముప్పందుం" అన్నట్టు యేమీ అవసరం లేందే హిందీలో మునిగిపోతూ వున్న మనవారు ఇలాంటి మాటల వల్ల మరింత దూర మైపోరూ తెనుగుతనానికీ?.. ...కుటుంబరావుగారు కామేశ్వరరావుగారని, గోపాలకృష్ణమూర్తిగారిని, హనుమచ్ఛాస్త్రిగారినీ విమర్శించారు. కామేశ్వరరావుగారి జాబు ఇంకోమాటు చదివితే దాల్లోనే వున్నాయి కుటుంబరావుగారికి జవాబులు! "ఈ హిందీ ఆరాటంతో తెనుగువారిలోని రవంత తెనుగుతనమున్నూ రాలిపోతున్న"దని హనుమచ్ఛాస్త్రిగారంటె, "ఈహిందీప్రచారం రాకమునుపు మనకు ఉండి ఇప్పుడు పోయిన తెనుగుతన మేమిటి?" అని అడిగారు కుటుంబరావుగారు. నిజమే. ఇదివరకి తెనుగుతనం తక్కువ కనక ముందు మనం అదే సంపాదించుకోవాలి. అది లేని మనకి హిందీ యెందుకు? తెనుగువాడు తాను తెనుగువాడుగా నెగ్గలేనప్పుడు హిందీని ఏంచేసుకుంటాడూ? దాని దురాక్రమణాన్ని యేం అడ్డుకోగలడూ? మనకి తెనుగుతనం తక్కువ కనకనే అరవలలాగా, కన్నడులలాగా, ఇంకా తక్కిన వారిలాగా కాకుండా హిందీ అంటే ఆత్మహత్యకి కూడా సిద్ధపడుతున్నాం......"తెలుగులో మంచి పత్రిక లింకా ప్రారంభం కాలే దనే చెప్పాలి" సందేహం లేదు. కాని మంచివి యెలా ప్రారంభం అవుతాయీ? ఇంగ్లీషు బాగా అర్థం కాని తెనుగువారు ఇంగ్లీషుపత్రికలు కొనడం లేదు, కాని హిందీ నేర్చుకుంటూ వున్న తెనుగువారు ప్రారంభంలోనే హిందీపత్రికలు కొంటున్నారు. ఆహిందీపత్రికలను వారు సరిగా చదవనేనా చదవలేరు. ఇక అర్థం తెలవడం దాకా యెందుకూ? అలాగ ప్రారంభస్థితిలో గూడా పెద్దపెద్ద చందా లిచ్చి వారు హిందీపత్రికలు తెప్పించుకుంటారు గాని తెనుగుపత్రికల కేసి చూడరు. తెనుగుపత్రికలనే చదవవలసినవా రంతా యిలాగ హిందీపత్రికల కోసమే తమ పర్సులు ఖాళీ చేసుకుంటూ వుంటే యిక తెనుగుపత్రికలకు ఆర్థికపుష్టి యెలా కలుగుతుందీ? అది లేందే పత్రికలకు సర్వాంగసౌందర్యం యెలా వస్తుందీ? "తెనుగురాతలో కొమ్ములు తిరిగినవాడికి పెట్టేవాడి వేతనం కూడాలభించడం లే"దని విచారిస్తూనే కుటుంబరావుగారు "ఆలోపం భారతిలోనే ఉందనుకోరాదూ?" అనడం యేం బాగుందీ? ఆర్థికపుష్టి లేక భారతి కొత్తమార్గాలు తొక్కలేకపోతోంది అక్కడికీ రచయితలకు యే తెనుగుపత్రికా ప్రారంభించని సత్కారం ప్రారంభించి కూడా భారతి మంచి రాతలు సంపాదించలేకపోతోంది. ఈస్థితిలో మనవారు హిందీపత్రికల కొగబాకితే తెనుగుపత్రిక లింకా కూలిపోవూ? ప్రబుద్ధాంధ్రను మూచూసేవాడు లేకపోతే అది మాలోపం అని కూడా వొప్పుకుంటాం. అయితే వున్నంతమట్టుకేనా తెనుగుపత్రికలను చూడక వాటికి చెయ్యవలసిన ఆర్థికసాహాయ్యాన్ని హిందీపత్రికలకు చెయ్యడం తెనుగువారికి గౌరవం గాని, ఆదరం కాని కలిగిస్తుందా? పోనీ, తెనుగుపత్రికలు మంచిస్థితిలో లేవు కనక తెనుగువారు వాటిని మూచూడం లేదు. హిందీపత్రికలు సర్వాంగసుందరాలయితే అవి చదువుతూ వున్న తెనుగువారికి "అయ్యో, మన కిలాంటి పత్రికలు లేవే!" అన్న విచారం కలగడం లేదేమీ? హిందీపత్రికలవంటి పత్రికలు తెనుగులో బయలుదేరడానికి వారు సాహాయ్యం—ప్రయత్నాలు చెయ్యడం లే దేమీ? ...ఇంతకీ తెనుగువాడికి "నేను బాగుపడాలి" అనే ఆవేదన కలగ లేదు. కలగవలసిన సమయంలో హిందీవెల్లువ వచ్చి తెనుగుజాతిమీద యిసకమేటలు వేస్తోంది. ఇది కాదంటే లాభం లేదు. కుటుంబరావుగారి లేఖ కూడా యిందుకు నిదర్శనంగానే వుంది......అయితే కుటుంబరావుగారు పేరుపేరు వరసల్ని ప్రబుద్ధాంధ్ర విలేఖకుల నందర్నీ విమర్శించారు. ప్రబుద్ధాంధ్రనీ చంద్రికనీ, యీవాదంతో సంబంధం లేని భారతినీ ప్రస్తావించారు. కాని ఆంధ్రభూమి ప్రస్తావన చేశారు కారు. ఏం?

సంపాదకుడు

౨

“నిజానికి తెనుగు భాష సంగతి తలుచుకుంటే సిగ్గు కాదు, దుఃఖం వస్తున్నది. మొదటినుండీ అన్యభాషాభిమానులైన కొందరి చేతుల్లో పడి తెనుగు తన వ్యక్తిత్వమే గోల్పోయింది, చాలవరకు”

“ఆనాడు సంస్కృతమును దేవభాషగా కొలిచే మన పండితులూ, కవులూ ప్రభువుల అధికారబలంతో స్వచ్ఛమైన తెనుగును శల్యావశిష్టముగా చేశారు. తెనుగు నుడికారం కంటే మన పురాణాలలోనూ, ప్రబంధాలలోను సంస్కృతనుడికారమే రాజ్యం చేసింది. సంప్రదాయాలు, కవిసమయాలు, వర్ణనలు, లోకోక్తులు, వృత్తాలు ఒకటేమిటి అన్నీ సంస్కృతంనుండే దిగుమతి. తుదకు సంస్కృతమే తెనుగుకు తల్లిభాష అనీ, తెనుగు స్వతంత్రభాష కాదనీ, తెనుగుకు ఉత్పత్తే లేదనీ, అనడానికి కూడా వెనుదీయలేదు. తెనుగు స్థితి యెంతవరకూ వచ్చిందంటే? తెనుగువ్యాకరణం చదువుకోవాలంటే సంస్కృతం రాకపోతే వీల్లేదు. ఇలాంటి దౌర్భాగ్యం యే భాషకీ ఉండదు. తెనుగువాడికి తెనుగుదేశంలో గీర్వాణం వస్తేనే గాని చెలామణీ లేదు.—ఇలా వుండగా ఇంగ్లీషు వచ్చింది. దానితో మరొక దెబ్బ తగిలింది తెనుగుకు”

“మనవారు పట్టభద్రులవుతారు. అమాంతంగా యింగ్లీషులో గంభీరోపన్యాసాలిస్తారు, కాని యీపట్టభద్రులలో నూటికి తొంబదిమందికి తెనుగు వర్ణక్రమం సహా సరిగా రాదు తెనుగుపత్రిక చదివితే అర్థం కాదు. ఉపన్యాసాలకు తెనుగులో నోరు తిరగదు. ఇదీ తెనుగువారి స్థితి. తెనుగు చదువుకుంటే తెనుగుదేశంలో పొట్టకు కూడు దొరకదు. ఆంగ్లపండితుల నౌకరులకు దొరికేటంత జీతమైనా దొరకదు, మన తెనుగు పండితులకు”

“ఇది కొంత తగ్గుదల చూపిందని అనుకొంటూ వుండగా తుదకబ్బెరా—అన్నట్లు హిందీ ఉద్యమం వచ్చింది. ఇది మరొక దెబ్బగా ఉన్నదిప్పుడు. స్పష్టంగా తెనుగు మాట్లాడడమైనా రానివారు కూడా హిందీవంక తిరిగారు. దానితో ఉన్న కాస్త తెనుగు అభిమానం కూడా సున్న అవుతున్నది. హిందీప్రచారకుల మితిమీరిన ప్రచారమువల్ల తెనుగుభాషకు కలుగుతున్న అపకారం ప్రత్యక్షంగా కనపడుతున్నది. సంస్కృతంవల్లా, ఇంగ్లీషువల్లా మనం కొంత విజ్ఞానం సంపాదించాము కాని తెనుగుకంటే ఏవిధంగానూ సారస్వతంలోగాని, విజ్ఞానంలో గాని అధికస్థానం లేని హిందీవల్ల మనం నేర్చుకోతగినదేదీ లేదు. అయినా మనను ముంచెత్తుతున్నది. ఈప్రవాహం యిల్లానే సాగితే ముందు ముందు తెనుగుభాషకు తెనుగు దేశంలో దిక్కుఉండదనిపిస్తోంది.”

“కాంగ్రెస్సువారూ, గాంధిమహాత్ముడూ హిందీ నేర్చుకోవాలనడంలో వారి అభిప్రాయం తెనుగును విస్మరించమని కాదు. అలాగు ఎవరైనా భావిస్తున్నారంటే అది పొరపాటే అవుతుంది. బెంగాలీవారూ, అరవలూ మొదలైనవారు సహా అవసరమైనంతమట్టుకు హిందీ నేర్చుకుంటున్నారు. కాని మనవారివలె మాతృభాషను త్రోసిరాజని హిందీని స్వీకరించడం లేదు”

“హిందీలో పట్టాలు పొందుతూ, తెనుగు సరిగా చదవడము కూడా రానివారున్నారంటే తెనుగు మూలపడుతున్నదన్నమాటే కదా?”

“దేశమందరికీ తెలిసే భాష ఒకటి ఉండడం అవసరమే. అదెవరూ కాదనరు. కాని యెంతవరకు అవసరమో అంతవరకే నేర్చుకోవాలి. కాని నిత్యవ్యవహారమంతా హిందీలోనే జరగాలంటే తెనుగుదారేమిటి అంటాము. తెనుగుదేశంలో గ్రంథాలయాలు మూలపడి నామమాత్రాలుగా ఉంటే వాటిని మరిచి హిందీగ్రంథాలయాలకోసం సర్వశక్తులూ వినియోగిస్తున్నారు. తెనుగు పత్రికలు

కొన ఊపిరితో బ్రతుకుతూ, చస్తూ ఉంటే హిందీ పత్రికలు వేలకొద్దీ దిగుమతీ చేస్తున్నారు. తెనుగు గ్రంథకర్తలు ప్రోత్సాహం లేక మూలమూలల మాడిపోతూ వుంటే హిందీకోసం వేలకొలదీ రూపాయలు ధారపోస్తున్నారు. తెనుగు ముందా హిందీ ముందా తెనుగువారికి! ఆంధ్రపత్రికవంటి వార్తాపత్రికలలో హిందీ ప్రచురించడం సంగతి అటుంచండి. కేవలం వాఙ్మయసేవకోసం పుట్టిన భారతిలో కూడ హిందీవ్యాసాలు వేశారు. అవీ విజ్ఞానవిషయాలు కాదు, కేవలం ఉపన్యాసాలు"

"తెలుగులో సంపూర్ణమైన వ్యాకరణము లేదు, నిఘంటువు లేదు, లక్షణగ్రంథం లేదు, చరిత్ర లేదు, భాషాశాస్త్రం లేదు, ఇంకా యెన్నో లేవు అముద్రితగ్రంథాలు చెదపురుగుల కాహారమవుతూ కుప్పలు కుప్పలు నశిస్తున్నాయి, కాని మనం అన్య భాషకోసం ప్రాకులాడుతున్నాము. మాతృభాషను ఉపేక్షించి పొరుగింటికి చేతులు చాపుతున్నాము. ఇదీ మన తెనుగుసేవ"

"ఈసమయంలోనే తెనుగు యువకులు, తెనుగు నాయకులు జాగ్రత్తపడకపోతే ముందు ముందు తెనుగువారి చరిత్ర యింకో విధంగా పరిణమిస్తుంది. గనక తెనుగు కేమాత్రమూ నష్టం కలగని విధంగా హిందీప్రచారం సాగించడానికి ఒక ప్రణాళిక యేర్పరచడం అవసరమని మాఅభిప్రాయం. అలాంటి ప్రణాళిక తయారు చెయ్యడానికి హిందీ ప్రచారకులూ తెనుగు విద్యాధికులూ సమావేశము కావాలని కోరుతున్నాము. అట్టి సమావేశం యేర్పాటు చేసే బాధ్యత ముఖ్యంగా తెనగునాయకుల మీదా ఆంధ్రసభలవంటి మహాసభలమీదా ఉన్నదని మనవి చేస్తున్నాము"

సత్యవాణి ౨౨—౬—౩౮

౩

కాంగ్రెస్ వ్యవహారాల్లో జోక్యంతగిలిన ప్రతి ఆంధ్రుడికి ఏదో కొంత సంస్కారవాసన తగులుతోంది ఆవాసనలు వక రకంగాలేక భిన్నభిన్నలుగా వున్నాయి ఏదెట్లాయున్నా, ఆంధ్రదేశానికి, ఆంధ్రభాషకు ముప్పురాకుండావుంటే యే చిక్కులేదు. కాంగ్రెస్‌లో చిక్కుబడే, ఆంధ్రులు చేరువకువచ్చిన ప్రత్యేకాంధ్రరాష్ట్రాన్ని అధోలోకంలోకి నెట్టేశారు ఈమాటంటే ఆంధ్ర కాంగ్రెస్ వాలాలు దెబ్బలాటకొస్తారు కాంగ్రెస్ వాలాల మెప్పుకోసం కొందరు తదితర వృద్ధనాయకులు వీరిని మొఖమాటానికైనా బలపరస్తున్నట్లు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ వెల్లువవచ్చి ఆంధ్ర రాష్ట్రాన్ని వెనక్కునెట్టేసిందంటే తప్పులేదని వాదిస్తారు. ఆవిషయం మరోమారు ప్రత్యేకంగా వివరిస్తాను. ఆంధ్ర కాంగ్రెస్ వాలాలకు అన్ని సంస్కారాలతో పాటు "హిందీ" నేర్చుకోటమనేదికూడా అలవాటయింది. అలవాటుగాదు, తల్లినోట్లో మట్టికొట్టి పెండ్లామును నెత్తె కెక్కించుకున్నట్లుగా వుంది ఆంధ్రులు హిందీ నేర్చుకోవడం. అసలు ఆంధ్రులు హిందీ నేర్చుకోవడానికి అలవాటు పడ్డది కారాగృహాల్లోనని నాయనుభవం. ౧౯౩౦_౩౧ సంవత్సరములలో కాంగ్రెస్ సత్యాగ్రహంలో జైలుకుబోయిన వారిలో హెచ్చుమంది హిందీని ప్రారంభించారు. జైలు ముద్దతినటం హిందీ బుక్కు చేపట్టడంగా జైళ్ళలో కాలం గడపారు ఆంధ్రులు. హిందీ చదివితే గొప్పవాడని, చదవని వాడు ముండనేవరకు కూడా ఆంధ్రులు జైళ్ళలో తేల్చారు. నిజంగా ఆంధ్రులలో చాలా మందికి హిందీని నేర్పడం ప్రారంభించింది పీసపాటి వెంకట సుబ్బారావు గారని చెప్పవచ్చు. వారికి గల శాంతం, నేర్పు, బోధనాశక్తి, విసుకులేక పోవడం వ్రాయడానికి సాధ్యం కాదు. బళ్ళారి, ఆలీపూరు జైల్లో ౧౯౩౦ నవంబరు ప్రాంతాల్లో అమాంబా

పతు ౧౬౦౦ మంది కాంగ్రెస్ ఖైదీలుండేవారు. వీరిలో అన్ని తరగతుల వారుండేవారు. అరవలు కేరళంవారుకూడా ఆలీపూరు జైలులోవున్నా ఆంధ్రులంత వెర్రితనంగా అరవలు వగైరాలు హిందీని చంపలేదు (?) జాతీయగీతాలు పాడాలంటే ఆంధ్రులు హిందీలో పాడితే అరవలు తమిళంలోనే విశేషంగా పాడేవారు. ఆంధ్రులు ప్రత్యేకంగా ఆంధ్రభాషను నేర్చుకోవడానికి ప్రయత్నం యెక్కువ చేయలేదుగాని అరవలు మాత్రం తమిళ భాష తరగతులుగా నేర్చుకుంటూ నేర్పేవారు. ఆంధ్రభాషను నేర్చుకుందామని నాబోటి వారెవరయినా మొదలు పెట్టితే, మన ఆంధ్రసోదరులు హిందీ నేర్చుకోరేమని యెగతాళికూడా చేశారు. అన్నప్పటికీ, ఆంధ్ర పండితులగు శ్రీగరికపాటి మల్లావధానిగారివద్ద కొంత మందిమి తెలుగు కావ్యమే చెప్పుకున్నాం రెండో పని ఆలీపూరు జైల్లో లేకపోవడంవల్లను విసుగు విరామం లేకుండా సుబ్బారావుగారు వుదయం నుంచిరాత్రి ౯ గంటలవరకు శాంతంగా చెప్పడంచేతనున్నూ చాలామందికి హిందీమీద ప్రేమపుట్టి బంగీలకు బంగీలు హిందీపుస్తకాలు తెప్పించి, హిందీని ముంచేశారు చాలామంది జైళ్ళలోనే హిందీలో తయారైనారు. జైళ్ళకువచ్చినవారిలో చాలామంది పల్లెవాసులే గనుక జైళ్లనుంచి బయటికి రాగానే ప్రతివారు హిందీ వ్యాపించేశారు. చేస్తున్నారు. ఆంధ్రనాయకులంతా "హిందీ" "హిందీ" అని వేదికలలో వుపన్యాసాలు చెప్పడం జోరయిపోయింది. మగాళ్ళను అంటిన యీవాసన స్త్రీలకున్నూడా సోకింది. స్త్రీలుకూడా హిందీని బాగా ప్రేమించి వ్యాపింపజేశారు. హిందీభాష నేర్చుకుంటున్నా, ఆంధ్రభాష చదివి, తర్వాత హిందీ చెప్పుకుంటే అసలు తగాదా లేదు తెలుగులో మాట్లాడడం, వ్రాయడం రాని ప్రతి ఆంధ్రుడు హిందీని నేర్చుకొని తల్లిభాష ఆంధ్రమునకు స్వస్తి చెప్పినారు. ఇప్పుడు హిందీ భాష ఆంధ్ర దేశంలో పల్లెపల్లెలో తాండవమాడుతూంది. అనేక మంది కాంగ్రెస్ యువకులు హిందీ నేర్పడానికి పల్లెల్లో ప్రయివేటు బళ్లుపెట్టుకుని జీవనం చేస్తున్నారు హిందీపత్రికలు పూర్తిగా ఆంధ్రభూమికి దిగుమతి అవుతున్నాయి. బెజవాడలో పెద్ద హిందీ విద్యాలయం స్థాపన అయింది. ఇతర రాష్ట్రాలవారికంటే ఆంధ్రులు అతి వేగంగా హిందీని ముట్టడిస్తున్నారు. ఇందువల్ల ఆంధ్రులకు వచ్చే ఫలితం ఏమీకనబడదు. బ్రిటిష్ బావుటా ఎగురుతూన్నంత వరకు యింగ్లీషు చదివిన వారిని కాదని హిందీ చదివిన వారికి గొప్ప వుద్యోగాలు రావు, ఉన్నత గౌరవాలురావు. అసలు హిందీ మాతృభాషగా కలిగిన ఉత్తరదేశస్థులకే యేమీ లేనప్పుడు ఆంధ్రులు హిందీ చదువుకుంటే వచ్చేదీ కనుబడదు ఇక కాంగ్రెస్‌లో గాంధిగారు హిందీమాట్లాడితే అర్థంకాదంటారా? ఆ భాగ్యానికి యిప్పుడు మన ఆంధ్రులు చదువుతున్న వాయువేగమనోవేగంగా ఆంధ్రభాషకు స్వస్తి చెప్పి హిందీనే నేర్చుకోవాలిసిన జరూరు లేదు. స్వరాజ్యంవస్తే హిందీఅవసరం అంటారా-భగవంతునిదయవల్ల అదే జరగాలిగాని అప్పటికి హిందీ రాకపోదు. ఇంతవు ఆంధ్రభూమిలో హిందీని భుజాలమీద యెక్కించుకొని ఆంధ్రభాషను దిగతొక్కుతూవున్నది యెవరంటే ఆంధ్ర కాంగ్రెస్ వాలాలని నామనవి. ఇతరరాష్ట్రాలవారు కాంగ్రెస్‌లోవుండికూడా వారి రాష్ట్రములను, మాతృభాషలను పూజించి, ఆదరించి, తర్వాతనే కాంగ్రెస్‌ను కొలుస్తున్నారు. ఇక మన ఆంధ్రులో కాంగ్రెస్ సముద్రంలో మునిగి యిదిగో అదిగో గావున్న ఆంధ్రరాష్ట్రాన్ని నామరూపాలు లేకుండా చేసుకున్నారు. ఇప్పుడు హిందీవెల్లువలో మునిగి తల్లి భాష అయిన ఆంధ్రభాషకు కళంకం గలుగజేస్తున్నారు దేశభాషలందు తెనుగు

లెస్స అనేమాట మన ఆంధ్రులు, ముఖ్యంగా కాంగ్రెస్ వాదులు గుర్తించాలి. హిందీని తగినంతవరకే గౌరవించాలి. మాతృభాషను ముందు గౌరవం చేయాలి. నూతనాలంకారాలతో ఆంధ్రభాషామ తల్లికి అడుగులొత్తాలి. ఆంధ్రులలోవున్న అన్ని రకాల భేదాలు పోగొట్టాలి. ఆంధ్రమూర్తిత్వం వకటేనని బెంగాలువారివలె కనపర్చాలి. ఇప్పటి వలె హిందీని ఆంధ్రభూమిలో పరువెత్తనిస్తే ఆంధ్ర భాష గౌరవం తగ్గుదల కాకపోయినా ఆంధ్రుల అశక్తి బయటపడుతుంది. ప్రజామిత్ర, సమదర్శిని, త్రిలింగ, చిత్రగుప్త, ఆంధ్రభూమి, కృష్ణాపత్రిక, మున్నగు తెలుగు పత్రికలన్నీ యీవిషయాన్ని గుర్తించి ప్రచారం చేయాలి. "ప్రబుద్ధాంధ్ర" యీవిషయంలో తీవ్రంగా పనిచేయటానికి నడుం కట్టింది. సమకాలిక పత్రికలు, ఆంధ్రభాషాభిమానులగు ఆంధ్రులు ప్రబుద్ధాంధ్రకు చేయూతనిచ్చి తెలుగుభాష గౌరవాన్ని నిలపెట్టి హిందీ వెల్లువ లోనుంచి ఆంధ్రులను బయటికిలాగి, ఆంధ్రులంతా కలిసి ప్రత్యేకాంధ్రరాష్ట్రాన్ని సాధించటానికి పూనుకోవాలని పత్రికాధిపతులను, యువకులను ప్రార్థిస్తూ విరమిస్తాను.

మల్లెల శ్రీరామమూర్తి (ప్రజామిత్ర)

రెండు జాబులు

"ఆర్యా, ఇప్పుడు నేనో రచయిత వ్రాతను బట్టి ఒక వ్యాసం వ్రాస్తే ఎంతవరకు అతనికి ఋణపడ్డానో చెప్పాలా వద్దా? సరే. అనువాదమే చేశాననుకోండి, అభోగట్టా లోకానికి తెలియజెయ్యాలా వద్దా? ఇది ఫలానా వ్రాతకు ప్రతికృతి అని చెప్పనంతకాలం ఇది మనదేఅని లోకం అనుకుంటుంది కదా—ఎందు కనుకోనియ్యాలి? సారస్వతంలో నిజాయితీ గొప్ప సుగుణం కాదా?

ఇట్టి నిజాయితీని అతిక్రమించిన వ్యాసం ఒకటి మీ ప్రబుద్ధాంధ్ర జూలై సంచికలో ఉన్నది. "చంటిపిల్లలు చనిపోవడం" అని ఆవ్యాసంపేరు. అది స్వతంత్రరచనకాదు. దానికి ఆంగ్ల వ్యాసకర్త Leigh Hunt వ్రాసిన "On the death of little children" అన్నది మాతృక. ఈ సంగతి ఎందుకు చెప్పబడలేదో? నేటికాలంలో చాలామంది తాము తర్జుమాలుచేసినా వాటికిఫలానా పూర్వరచన ఉన్నదని చెప్పడంలేదు. ఇప్పుడు వాఙ్మయంలో ఈ సంప్రదాయం అంతరించిందా ఏమిటి? దీనికి మీ అనుమోదం కూడా ఉన్నదా ఏమిటి?

శ్రీరంగం శ్రీనివాసరావు

(తెనుగులో స్వతంత్రంగా రాయబడ్డ రచనలు ప్రకటించడమే మా సంకల్పం, కాని యెవరేనా యితరభాషలలో వున్న గొప్పరచనలు అనువదించి పంపిస్తే "ప్రకటించకూడ" దని మేము వ్రతం పూనలేదు అయితే శ్రీనివాసరావుగారు చూపిన వ్యాసం అలాంటి దనే వూహతో ప్రకటించబడ్డది కాదు. అసలది స్వతంత్రం కా దని మాకు తెలవనే తెలవదు వ్యాసకర్త యెక్కడా, యేవిధంగానూ ఆసంగతి సూచించలేదు. అలా సూచించకపోవడంలో వ్యాసకర్త వుద్దేశం యేమిటో మాకు తెలవదు, గాని అది మేము తప్పనే నమ్ముతాము. అయితే శ్రీనివాసరావుగారు చెప్పినట్టు ఇతరభాషలోవున్న రచనకు అనువాదం చేసి—లేక దాన్ని అనుసరించి రాసి ఆసంగతి చెప్పకపోవడం మనలో కొందరికి పిత్రాచారంగా వుంది ఇది మంచి దని మేము చెప్పలేము. ఇలాంటి రహస్యాలను కనిపెట్టడం అన్ని సందర్భాల్లోనూ, అందరి విషయాల్లోనూ సంపాదకులకు—విశేషించి మాకు సాధ్యం కాదు. వ్యాసకర్తే తన ధర్మం నెరవేర్చుకోడం

చాలా మంచి పని. ఈ ధర్మాన్ని గమనించి వ్యాసకర్త చెప్పక, సంపాదకుడు గమనించలేక యీలాగ జరగడం తటస్థిస్తే అక్కడ పశ్చాత్తాపపడడం తప్ప వేరు గతి లేదు. సంపాదకుడు)

౨

“నమస్కారములు— మీపత్రికలో వచనవ్యాసాలే గాని పద్యవ్యాసాలు ప్రకటించమని నియమం పూనినారు. దీన్ని పురస్కరించుకొని ప్రబుద్ధాంధ్రను ప్రశంసించే వారిలో కొందరు గతానుగతికంగా ఆధునిక పద్యవాఙ్మయాన్ని తీవ్రంగా నిరసించినారు. గద్యవ్యాసాలు మాత్రమే ప్రకటిస్తామంటే మీరు గద్యవాఙ్మయశాఖను అభివృద్ధి చేయడం కోసమే ఆనియమం పూనినారనుకున్నాను, కాని పద్యవాఙ్మయనిరసనమే మీఅభిప్రాయమేమో అనుకోవడానికి అవకాశమిస్తున్నవి మీ పత్రికలోని వ్యాసాలు. మనము ఒక వాఙ్మయశాఖను అభివృద్ధి చేయడం కోసం ఇంకో శాఖను నిరసించడం కేవలం సాహసం. ఇంగ్లీషు మొదలైన ఇతరభాషల్లో కూడ కథల పత్రికలూ, పద్యాల పత్రికలూ మొదలైనవి ఆయా శాఖలను ప్రత్యేకం అభివృద్ధిపరిచే అభిప్రాయందో నెలకొల్పినారు. కాని అంత మాత్రాన ఇతరశాఖలను వారెవరూ నిరసించడం లేదు. ఈ విషయంలో మీ అభిప్రాయం ఇదమిత్థమని ప్రకటించడం భావ్యమేమో అని తలంచుచున్నాను.

ఉన్నతాదర్శాలు గల మీపత్రిక ఉత్తమస్థానం అధిష్ఠించి వాఙ్మయసేవ చేయగలదని ఆశిస్తున్నాను.”

పురిపండా అప్పలస్వామి

(మా మిత్రులు అప్పలస్వామిగారు ఈవిషయం యిలాగ్గా లేఖారూపంగా అడగడం చాలా మంచిదయింది. ఏమంటే? అయిదారుగురు మిత్రులు ఈవిషయంలో మమ్మిలాగే ప్రశ్నించారు. “ప్రబుద్ధాంధ్రలో పద్యవ్యాసాలు ప్రకటించబడవు ఎంచేతా? ప్రతీభాషలోనూ అపారంగా వుండవలసిన వచనవాఙ్మయం తెనుగులో బొత్తిగా లేదు. కనక దేశీయులకు ఈవిషయంలో శ్రద్ధ వహించాలనే సంగతి స్ఫురించడానికి” ఇదీ మా వుద్దేశం ఇంతే కాని పద్యవాఙ్మయాన్ని మేమే సందర్భంలోనూ నిరసించం. కళాదృష్టితో చూస్తే వచనానికీ, పద్యానికీ తారతమ్యం చూపించడానికి అవకాశం లేదు కానయితే వచనం అయితే కవితయొక్క నిసర్గమాధుర్యమే అనుభవంలోకి వస్తుంది. పద్యం అయితే కవిత్వమూ సంగీతమూ మిళితమై విలక్షణమైన రుచి కలుగుతుంది. ఇది గమనించలేక కొందరు కవిత్వం పద్యమయం గానే వుంటుందని భ్రమిస్తారు కవిత్వం మాటల కూర్పుదలలో పొటమరిస్తుంది, కాని ఛందస్సులో కాదు. అయితే ప్రతీదేశంలోనూ ఆదిలో పద్యవాఙ్మయమే ప్రారంభమయింది. (ఇక్కడ పద్యం అంటే గేయాలకు కూడా గ్రహణం) పద్యవాఙ్మయం కూలంకషం అయిన తరవాతనే వచనవాఙ్మయం పొడచూపుతూ వచ్చింది ఈస్థితిలో కవిత్వం వల్ల ఆనందం అనుభవించగలవాడు పద్యాన్ని గాని, వచనాన్ని గాని యెలా నిరసించగలడూ? అయితే. వొకటి మాత్రం వుంది. పద్యవాఙ్మయానికి జనుల నందర్నీ సంస్కృతచిత్తులుగా చేసే శక్తి లేదు వచనవాఙ్మయానికి ఆశక్తి వుంది. మేము ప్రబుద్ధాంధ్రలో పద్యవాఙ్మయాన్ని మాని వచనవాఙ్మయాన్నే స్వీకరించడానికి యిదీ వొక కారణమే. సంపాదకుడు)

వ్యాఖ్యానములు

ఆంధ్రమహాసభ

ఇది గుంటూరు జిల్లాలో జరుగుతుం దని మొదట కబురు వచ్చింది. తరవాత రాయలసీమలో—అనంతపురంలో అన్నారు. మరికొన్ని సభలు కూడా దీనికి జత చెయ్యా లని ఆలోచనలు జరిగాయి కనకనూ, అప్పట్లో ఓఢ్రుల దురాక్రమణవాంఛ మనలో కొంచెం—మాట మట్టుకేనా కసింత చురుకు పుట్టించి వుంది కనకనూ, కాంగ్రెస్సు సంబంధమైన అడావిడి యేమీ లేకుండా దేశం అంతా నిస్తరంగసముద్రం లాగ నిశ్శబ్దంగా వుంది కనకనూ వొక నెల యెచ్చు తక్కువగా నేనా సభ తప్పకుండా జరుగుతుం దనీ, ఆజరగడం రాయలసీమలో కావడంవల్ల ఆధ్రైక్యం సిద్ధించే కార్యక్రమం నడుస్తుం దనీ ఆశపడ్డాం.

కాని యిక యిప్పుడా ఆశకి యెడం లేదు.

ఏమంటే? కాంగ్రెస్సుకి కట్టుళ్లు తప్పిపోయాయి. పైగా అది అసెంబ్లీ యెన్నికలలో పోటీ చెయ్యడానికి నిశ్చయించుకుని చాలా ముమ్మరంగానూ, చురుగ్గానూ సన్నాహాలు చేసుకుంటోంది. జస్టిసు పక్షం కూడా యెన్నికల ప్రవాహంలో వురికి చాలా తీవ్రంగా పని చేస్తోంది. అపైని ఆంధ్రరాష్ట్రం అంటే కాంగ్రెస్సుకి నీరసమూ, జస్టిస్సు పక్షానికి అనిష్టమూనూ.

సరే, యిక మితవాదులకు ఆంధ్రోద్యమం యెప్పుడూ సవతి బిడ్డగానే వుంది.

ఇలాగ ఆంధ్రమహాసభ మళ్ళీ యింకో మాటు వెనకబడిపోయింది.

ఏం? కాంగ్రెస్సు పెదవి విరిచినంత మాత్రానా, జస్టిస్సుపక్షం వ్యతిరేకించినంత మాత్రానా, మితవాదులు యీ వేపుకే చూడనంత మాత్రానా ఆంధ్రోద్యమం చప్పబడిపోవలసిందేనా?

ఆంధ్రజాతి అంటే శుష్క—రాజకీయప్రచారకుల యీ మురాలు మాత్రమే కాదు. ఈకాంగ్రెస్సూ, ఈజస్టిసుపక్షమూ, యీమితవాదివర్గమూ, కల్లోలాలు పెంచి వున్న రవంత శక్తినీ ఛిన్నాభిన్నాలు చేసేవే గాని ఆంధ్రజాతికి పుష్టి కలిగించేవి కావు. మరిన్నీ భావదాస్యమూ అనుకరణపరాయణతా స్పర్ధా పెంచి చీలికలు కలిగించేవే కాని నవశక్తి సంఘటించి, దృక్పథాన్ని కాలానుగణ్యంగా మార్చి, విలక్షణమైన వికాసం కలిగించతగ్గవి కావు.

ఆంధ్రజాతికి ఇవి ప్రాతినిధ్యం వహించ తగ్గవి కానే కావు,

ఆంధ్రదేశంలో యిప్పటికి కూడా యెలాంటి ప్రతికూలశక్తులు ముట్టడించినా సంప్రదాయాన్ని చిరసంచితమైన జాతీయధర్మాన్ని ప్రాణపదంగా కాపాడుకుంటూ వస్తూవున్న! గృహస్థులు, పండితులు, స్త్రీలు, వ్యవసాయదారులు, శిల్పులు, కవులు, గాయకులు, పారిశ్రామికులు, వర్తకులు, సంపన్నులు, జమీందారులు ఉన్నారు. సమయం వస్తే ఆంధ్రజాతియొక్క పూర్వోన్నతికి స్మృతిచిహ్నాలుగా నిలవగలవారు వీరే గాని ఆరాజకీయపక్షాల క, చ, ట, త, పలు కావు. పరవశులు కాని పత్రికాసంపాదకులూ, నవీనవిజ్ఞాన భరితులై వున్న ఆంగ్లవిద్యాపారంగతులూ, పూనుకుని సంప్రదాయాన్ని భంగపరచని నవీనమార్గాలు చూపించి నడిపిస్తే మళ్ళీ ఆంధ్రజాతికి జవసత్వాలు కలిగించగలవారు వీరే గాని మ రెవరూ కారు.

కనక మన రాజకీయప్రచారకులు ఆంధ్రోద్యమాన్ని చిన్నచూపు చూస్తున్నా రంటే 'మనం ఆనందించతగ్గదే; గాని విచారించనక్కరలేదు

అయితే యిప్పుడు కర్మవీరుల యీవారసులకు ఉత్తేజం కలిగించాలి. ఇదీ యిప్పుడు అత్యవసరంగా

చెయ్యతగ్గపని. ఈపని చెయ్యా లంటే రాజకీయాలలో యే మాత్రమూ సంపర్కం లేనివారు ఆంధ్ర మహాసభని స్వాధీనం చేసుకోవాలి. ఆసందర్భాలున్నాయంటే యిప్పుడు ఆంధ్రరాష్ట్రప్రస్తావన కూడా విడిచిపెట్టివెయ్యవచ్చు. ఏమంటే ఆంధ్రరాష్ట్రం ప్రభుత్వంవారు నిర్మించవలసింది, కాని మన చేతిలో పని కాదు. రాజకీయాలు అనేకవిధాల కలుషితాలైపోయి వున్న యీసమయంలో దొరతనంవారు ఆంధ్రరాష్ట్రం నిర్మిస్తారని తోచదు. దీనికోసం మన జాతీయపునర్నిర్మాణం నిలుపు చెయ్యడానికి వీలు లేదు. ముందు ఆంధ్రజాతిఅంటే ఇరుగుపొరుగువారు "ఇలాంటిదా?" అని నివ్వెరపడేటట్టు చెయ్యాలి ఈఫలం లభించాలంటే ఆంధ్రమహాసభ యొక్క దుష్టాంగాలు ఛేదించి నూత్నరూపం యివ్వాలి.

ఆడంబరం లేని యీ జాతీయసేవ చెయ్యడానికి నడుం కట్టుకునే వారెవరు?

వినిపించుకోండి. కూలంకషాలైన గోదావరి, కృష్ణ, తుంగభద్ర, పినాకిని మొదలైన మహానదులతుంగతరంగాల కలకలనినాదంతో ఆంధ్రమాత యిలా అడుగుతోంది.

మన జాతి నిరీక్షిస్తోంది

ఏరోజు కారోజే మాహమ్మదీయులు హిందూ స్త్రీలను చెరబడుతూ వున్నట్టు ఉత్తరహిందూస్థానంనుంచి వార్తమీద వార్త వస్తోంది. తరుణవయస్కురాలైన హిందూస్త్రీ బయటికి వచ్చిందంటే మళ్లీ యింటికి చేరుకుంటుందా లేదా అన్న అలజడి అక్కడ క్షణక్షణమూ పెరిగిపోతోంది. ఎవరు దీనికి జవాబుదారీ?

హిందువు అయినవాడెవడూ దీన్ని అడ్డుకోలేకపోతున్నాడు. ఉపాయం కూడా యేమీ కనపడ్డం లేదు. హిందూస్త్రీల మానం రక్షించవలసిందనీ, మాహమ్మదీయుల స్వాధీనంలో వున్న తమ స్త్రీలను చెరవిడిపించవలసిందనీ అక్కడి హిందువులనేకులూ దొరతనంవారిని ప్రార్థిస్తున్నారు. అయితే యెంత బలవంతమైనా కేవలం దొరతనానికి ఇది సాధ్యమా? హిందూ స్త్రీలను హరించడానికి మాహమ్మదీయులకుండే ధైర్యసాహసాలు తమ స్త్రీలను రక్షించుకోడానికీ చెరవిడిపించుకోడానికీ హిందువులకు లేనప్పుడు భగవంతుడు మాత్రం యీసందర్భంలో యేం చెయ్యగలడూ?

మన వేదాంతం ఆత్మానాత్మవివేకం కలిగించడంలో అద్వితీయమే కావచ్చు. కాని అది పూర్తిగా మన కొంప తీసింది. అది మనకు మానవసహజమైన ఆశ లేకుండా చేసింది. అభిలాషను చంపేసింది తెంపు, అభిమానము, పౌరుషము, శౌర్యము, ధైర్యము —వీటిని బుగ్గి చేసేసింది. "ఏమీ లేదు. అంతా మాయ" అని మనోబోధ చేసి మన బుర్ర ఖాళీ చేసేసింది. హిందువుడి కంటే చలిచీమ నయం అనిపించింది.

నిజంగా మన మిప్పుడు కడుపునిండా తినలేము, మనసారా యేమీ అనుభవించలేము. కాలికొద్దీ నడవలేము. చేతికొద్దీ యేమీ చెయ్యలేము. కళ్లారా చూడలేము. ఆలోచించలేము. ఎత్తులు వెయ్యలేము. ముందుకి దుమకలేము. అంతే కాదు, వెనక్కి కూడా రాలేము. ఏం చెయ్యాలనుకున్నా నవనాడులూ కుంగిపోతాయి. అసలు తలుచుకోడానిక్కూడా శక్తి లేదు. జీవచ్ఛవం యేలాంటిదీ అంటే హిందూజాతిని ఉదాహరించవచ్చు.

మన జాతిని నిర్వీర్యం చేసింది ఇంగ్లీషు ప్రభువుల ఆయుధశాసనం కాదు, మన వైరాగ్యం.

మన జాతిని సకలవిధాలా నేలబెట్టి కొట్టేసి ఇలాంటి అధమాధమస్థితికి తెచ్చింది మన వైరాగ్యమే కాని మరేమీ కాదు.

అయితే: మన వైరాగ్యం యీ సంగతి కూడా మనకి బోధపడనివ్వడం లేదు. లేకపోతే వెయ్యేళ్లనుంచి మాహమ్మదీయుల ప్రవృత్తి చూస్తూ, రెండు

వందల సంవత్సరాలనుంచీ పాశ్చాత్యుల ప్రగమన శీలతని చూస్తా, తెలుసుకుంటూ మన మింకా పూర్వ స్థితిలోనే — ఆ వైరాగ్యాన్ని పట్టుకునే వేలాడుతున్నా మంటే అర్థం యేమిటి?

హిందూజాతి బాగుపడా లంటే యిప్పుడు రాజకీయాలవల్ల ప్రయోజనం లేదు, సంఘాచారాలను దిద్దడంవల్ల లాభం లేదు. కావలసిన అన్ని వస్తువులూ మనమే తయారు చేసుకున్నా మనం బాగుపడము. బయటినుంచి వచ్చిన ప్రతికూలశక్తు లేమీ మనల్ని పాడుచెయ్యలేదు. మన వైరాగ్యమే మనల్ని చెరిచింది చెరుస్తోంది. ఇంకా చెరుపుతుంది.

హిందూజాతిని బాగుచెయ్యగల మగవా డెవ్వడూ అంటే యీ వైరాగ్యాన్ని చంపగలవాడే. జాతి అంతా యిప్పుడు అలాంటి వ్యక్తికోసం నిరీక్షిస్తోంది.

ప్రతిష్ఠా పిశాచం

క=కామేశ్వరరావు అనే వారు (౨౮–౭–3౪ కృష్ణాపత్రికలో) "హిందీవ్యాప్తి ఉపద్రవకరమా?" అని అడుగుతున్నారు.

ఇంకా సందేహమా?

హిందీ తెనుగు భాషకు యెలాంటి వుపద్రవాన్ని కలిగిస్తోందో ప్రబుద్ధాంధ్ర జులై సంచికలో మేము చాలా వివరాలతో చూపించాము. (ఈసంచికలోనూ మరికొన్ని వివరాలు ఇచ్చాము) కామేశ్వరరావుగారు వాటి నన్నిటినీ బాగా పరిశీలించే వున్నారు. వారు అక్షరం అక్షరానికీ వాటిని స్మరిస్తూనే కృష్ణాపత్రికలోని వ్యాసం రాశారు. కాని ప్రబుద్ధాంధ్ర అనే పేరు పలకడానికి వారికి నోరు తిరగలేదు. రాయడానికి కలమున్ను ఆడలేదు.

"తెనుగు చచ్చిపోయి తెనుగువారి సర్వవ్యవహారాలలోనూ హిందీ ప్రవేశిస్తుందా?" అని కాదు ప్రశ్న. "హిందీప్రచారకుల ఉద్దేశం యేమిటి? దక్షిణదేశభాషల నన్నిటినీ చంపేసి హిందీనే స్వీకరించేటట్టు చెయ్యాలని వారు బ్బాహాటంగా చెబుతూ వున్నప్పుడు ఆప్రచారాన్ని మందలించడమా. బలపరపరచడమా?" "నేను తెనుగువాణ్ణి" అని సగర్వంగా అనుకోగలవాడి కిప్పుడిదీ సమస్య.

"తెనుగును నాశనము చేసి హిందీయే తెనుగు దేశములో పట్టము గట్టుకొంటుం" దని మా కేమీ భయం లేదు. హిందీప్రచారకుల వుద్దేశం కొంతవరకూ నెగ్గవచ్చు గాని చివరికి నిర్మూలమే అయిపోతుంది. నిజమే. కాని యిప్పు డీకంగాళీ అంతా యేమిటి? తెనుగు భాషకు పుష్టి కలిగించవలసిన కొంత కాలాన్ని దుర్వినియోగం యెందుకు చెయ్యాలి? తెనుగువారే చేస్తున్న దుష్ప్రచారం తగ్గించనక్కర లేదూ?

గాంధిగారు గుజరాతీలో చాలా చాలా పని చేసి వుండవచ్చు, కాని వారు ఎక్కడికి వచ్చినా "హిందీ నేర్చుకోండి" అని నిర్బంధిస్తున్నారు. వారు దేశభాషల ప్రస్తావన ప్రతీచోటా చెయ్యడం లేదు. దీనితో ప్రచారకులు ఆవేశం పొందుతున్నారు. సదసద్విచారమూ, లాభనష్టాలూ యెరగని దేశీయులు ప్రచారకుల దుర్బోధలో పడిపోతున్నారు. లేకపోతే తెనుగులో వర్ణక్రమమేనా సరిగా రానివారు కూడా హిందీలో పట్టభద్రు లవుతున్నా రంటే అర్థం యేమిటి? పుస్తకం చేతబట్టింది మొదలుకుని హిందీలో గిడసబారిపోయిన తెనుగువారు ఇంగ్లీషులో గిడసబారిపోయినవారి లాగే తెనుగుకు దూర మైపోడానికేమేనా అడ్డుందా?

"మాతృభాషాగౌరవమును చాటడానికి తెనుగునాడులో సరి యైన ఉద్యమము లేకపోబట్టే ప్రజలు తెనుగున్ను అశ్రద్ధ చేయడము తటస్థించినది. కాని తెనుగునందు ఏవగింపు పుట్టిన్ని, హిందీయందు మోజు పుట్టిన్ని కాదు"ట, అయితే మాతృ

భాషా గౌరవాన్ని చాటడానికి తమ దేశంలో సరియైన ఉద్యమం నడపలేని తెనుగువారు హిందీ ప్రచారోద్యమాన్ని శక్తికి మించి కూడా చేస్తున్నారంటే యేమన్న మాట? ఏభాషకెలాంటి గౌరవం చెయ్యాలో తెనుగువారికి తెలవదన్న మాటే కదా? అలాంటి తెనుగువారు సర్వానికీ హిందీనే ఉపయోగించడాని కేమేనా అభ్యంతరం వుందా? ఇంగ్లీషే చదువుకున్న వారిలో ఇప్పుడు చాలామంది చేస్తూ వున్న పనే కాదూ యిదీ? ఈసన్ని వేశం చూసేనా హిందీ విషయంలో మనం జాగ్రత్త పడవద్దూ?.

“పోనీ, హిందీప్రచారానికి పూర్వమైనా తెనుగు నభివృద్ధిపరుద్దా మనే సంచలనము పల్లెటూళ్లలో కలిగిందా? అప్పుడవి నిద్ర పోతూన్నవి”ట. తెనుగు దేశపు పరిస్థితులు తెలిసిన వారిలా అనలేరు. ఏమంటే? కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక చేసిన విజ్ఞానవ్యాపనమూ, ఉద్బోధనమూ ఇంతా అంతా అని చెప్పడానికైతి గాదు తరవాత విజ్ఞానచంద్రికా మండలిద్వారా కే వి. లక్ష్మణరావుపంతులుగారు మంచి నికరమైన ప్రబోధం కలిగించారు. తరవాత ఆంధ్రప్రచారిణి గూడా అపారమైన పరనతృష్ణ కలిగించింది ప్రారంభంలో అయిదారు సంవత్సరాలు ఆంధ్రమహాసభ చేసిన ప్రబోధం కూడా అనంతంగావుంది, కాని తరవాత కాంగ్రెసూ, హిందీప్రచారమూ వచ్చాక మన తెనుగువారు ఆంధ్రత్వాన్ని మరచిపోయారు. ఇది తెలవకుండా యేదో రాసెయ్యడం చాలా సాహసం అనిపించుకుంటుంది. పోనీ వారి మాటే వొప్పుకుందాం. “వాటిని (పల్లెలను) కాంగ్రెసూ తన్మూలకంగా హిందీ మేల్కొలిపినవి”ట. ఇదీ మాట. ఈముక్తాయింపుకోసం కామేశ్వరరావుగారు ఎత్తిన ఎత్తిది. అయినా వారి వాదాన్ని అంగీకరించినా హిందీ ఆంధ్రులను మేల్కొలిపిన దంటే తన జండెంలోకి యీడ్చుకుపోయిం దన్నమాటే కాదూ? లేకపోతే: హిందీద్వారా తెనుగు నేర్చుకుంటున్నా మంటారా? తెనుగువారికి ఇంతకంటే దౌర్భాగ్యం లేదు. ఇది సిగ్గుపడవలసిన విషయం.

“ఆంధ్రుల కిప్పుడు తల్లిభాషయెడల వారు నిర్వర్తింపవలసిన విధిని హెచ్చరించవలసియున్నది ఆ భాషాసౌందర్యమును వారికి హృద్గతము చేయవలసియున్నది”ట. ఈసంగతి తెలిసే వున్నప్పుడింకెందుకూ హిందీ అంటే అంత అభిమానమూ? మాతృభాషలో ప్రజ్ఞ సంపాదించుకోకుండా పరభాషలో పని చెయ్యడాని కెవరికీ అధికారం లేదు. అలాంటి ప్రజ్ఞ వున్నవారికి పరభాషలవల్ల యేమీ అపాయం కలగదు. తెనుగువారికి ముందు తెనుగు బాగా నేర్పి తరవాత హిందీ నేర్పుతామంటే యెవ రేమంటూరూ? “స్వతస్సిద్ధముగా అప్పుడే తెనుగుకు లభించే స్థానము తెనుగుకీ, హిందీకి లభించే స్థానము హిందీకీ, లభిస్తుం” దన్నారు కామేశ్వరరావుగారు. ఈమాట కోట్లు వెలచేస్తుంది.

తరవాత రామేశ్వరరావుగారు రవీంద్రునాథఠాకూరుగారి ప్రస్తావన చేశారు. ఎందుకో బోధపడలేదు. అలాంటి కవులు లేని భాషలవారంతా హిందీలో మునిగిపోవలసిం దనా వారి వుద్దేశం? శతావధాని వెంకటశాస్త్రిగారిని గూడా ప్రస్తావించి కామేశ్వరరావుగారు వారిని గౌరవించబోయారు, గాని చివరికి గౌరవస్థితిలో నిలపలేరు. ఏమో అన్నారు. కొండ యెక్కించబోయి చివరికి శాస్త్రిగారిని లోయలో కూలదోశారు. సాహసం.

ఇలాగ ఇప్పుడు జరుగుతూ వున్న హిందీప్రచారాన్ని ఎంత సమర్థించబోయినా కామేశ్వరరావుగారికి “కాని హిందీప్రచారకులు ఆంధ్రదేశంలో తెనుగు ఉన్న దనే గుర్తు కొంచెము ఉంచుకునే ప్రచారము చేయవలసి ఉంటుంది” అని “కాని ఈలోగా మాతృభాషాభిమానము వదలకు డని దేశీయులను హెచ్చరించడం మాత్రం మానడానికి వీలు లేదు” అని చివరికి వొప్పుకోక తప్పింది కాదు;

అయితే యీసంగతి వొప్పుకునీ లోపున వారిని ప్రతిష్ఠ యెంతేనా యిబ్బంది పెట్టింది. కాదూ? పరభాషావ్యామోహం సుఖసుఖాల పోనిస్తుందా మరీ?

అగ్ని పరీక్ష యిదీ

అనుకున్నంత పనీ జరిగింది.

"మహమ్మదీయుల్నా బలపరచడం, హిందువుల్నా?" అని అయినా కొంత అర్థం వుండును, కాని "మహమ్మదీయులా ప్రధానం, జాతీయతా?" అని కచ్చితమైన ప్రశ్న.

కాంగ్రెస్సు జీవితంలో యిలాంటి సందిగ్ధస్థితి యెప్పుడూ తటస్థించలేదు. బాధ్యతను గుర్తించే వారికి గుండెలు రువ్వా రువ్వా మనిపించే ప్రశ్న యిది, కాని నదురూ బెదురూ లేకుండా కాంగ్రెస్సు మహమ్మదీయుల పక్షం అవలంబించింది. మళ్లీ చూడబోతే ఆమహాసంస్థ పేరు భారతజాతీయ మహాసభ!

ఆణే, మాలవ్యాగార్లకు కాంగ్రెస్సులో వుండడానికి ఆస్కారం లేకపోయినందుకు కొందరు ప్రముఖులు విచారించారు, కాని గాంధిగారి కా బెంగ లేదు. వొక్క సత్యమూర్తిగారుంటే చాలు ననుకున్నారు గారు. నిజమే, కాంగ్రెస్సుకి ఇన్నాళ్ళకి దొరికింది దిగ్గజంలాంటి అవలంబం!

అయితే కాంగ్రెస్సు పక్షంగా చూస్తే యిది చాలా పకడైన సన్నివేశం. ఏమంటే? ఇప్పటిదాకా కాంగ్రెస్సుకి దొరతనంతో పోరాడడం వొక్కటే కార్యక్రమం. పర్యవసానం యెటు తేలినా దానికి విచారం లేదు. జయాపజయాలకు పూచీ అంతా దేశీయులదే.

ఇప్పుడదంతా మారిపోయింది. కాంగ్రెస్సే సొంతంగా మార్చుకుంది. జాతీయదృష్టితో పరిశీలించే అన్ని తెగల వారికీ. అన్ని మతాల వారికీ అన్ని జాతుల వారికీ, ప్రపంచకల్యాణాన్ని ఆశించే అన్ని దేశాలవారికీ దానిమీద అజమాయిషీ చెయ్యడానికి అధికారం పుట్టింది.

నిజంగా కాంగ్రెస్సుకి ఎప్పుడో కలిగివుండవలసిన స్థితి యిది.

గాంధిగారి ప్రతిభకి వొరపిడి యిదివరకే కాదు, యిక ముందు.

అయితే ఆణే, మాలవ్యాగార్లు మాత్రం తొణక్కుండా—మేరువులాగ నిశ్చలంగా నిలవబడి వుండాలి. లేకపోతే అంతా బూడిదలో పోసిన పన్నీరయిపోతుంది.

రాజూ, ప్రజలూనూ

హైదరాబాదు రాజ్యంలో యిక ముందు ఆరాజ్యం వారికే వుద్యోగాలు ఇదివరకే అక్కడ వుద్యోగాలు సంపాదించుకుని వున్నవారికి వుద్యోగభంగం చెయ్యరు, కాని కొత్తవారిని చేర్చుకోరు.

స్థూలదృష్టికి "ఏమిటీ యీ సంకుచిత నిశ్చయం" అనిపిస్తుంది చాలా మందికి కష్టం కూడా కలుగుతుంది, కాని కొనియాడవలసిన సిద్ధాంతం యిది. అందరూ అవలంబించవలసింది కూడానూ.

ఉద్యోగం దొరకడంవల్ల, దొరికిన వారికి నిర్విచారంగా సంసారం నిర్వహించుకోడానికి తగిన స్థిరమైన ఆదాయం కలుగుతుంది. ఈవిధంగా కొంత డబ్బు నైజాము రాజ్యంలోనే వుండిపోతుంది.

నిజమే, కాని యిక్కడ గమనించవలసిన సంగతి యిది కాదు దీనివల్ల దేశీయులకే ముట్టవలసిన డబ్బు పైవారు తన్నుకుపోరు. దేశీయులు అసంతృప్తులు కానక్కర లేదు. పొట్ట చేతబట్టుకుని అగమ్యకాకుల్లాగ అక్కడికీ, అక్కడికీ పరిగెత్తవలసిన బాధకూడా వుండదు.

ఇందులో ప్రధానమైన ప్రయోజనం యిదీ ఏమిటంటే?

"రాజునకు ప్రజ శరీరము. రాజు ప్రజకు నాత్మ" అని నీతివచనం. ఇప్పుడు హైదరాబాదు రాజ్యంలో యీనీతి సర్వవిధాలా అనుష్ఠానంలోకి వస్తుంది.

నైజాముగారి యీ ఫర్మానాకు మా అభినందనాలు తెలుపుతున్నాం.